




VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్



అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250



Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి:38 సంచిక :139 విశాఖపట్నం, 07 మార్చి 2026 శనివారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00


### రాబోయే ఏడాదికి పోలవరం పూర్తి చేసి

## జాతికి అంకితం చేస్తాం

### ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 6 :** రాష్ట్రంలో ఎలాంటి విభేదాలు లేకుండా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. మూడు పార్టీల నేతలు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా శాసనసభలో చంద్రబాబు మాట్లాడారు.

"గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకున్నారు. ఇష్టానుసారం అప్పులు చేసి ప్రజలపై భారం మోపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రీషెడ్యూల్ చేయించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. పథకాలు కొనసాగిస్తున్నాం. రాబోయే ఏడాదికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. కేంద్రం సహకారంతో ప్రపంచం మెచ్చేలా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం. మూడు పార్టీల్లోనూ చాలామంది కొత్త సభ్యులు వచ్చారు. అప్పటి ప్రభుత్వంపై పోరాడిన వారిలో చాలామందికి సీట్లిచ్చాం. నిలబెట్టిన అభ్యర్థుల్లో 94 శాతం మందిని గెలిపించారంటే అది మాపై ప్రజల్లో ఉన్న నమ్మకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సఖ్యతతో పనిచేస్తున్నాయి. రాష్ట్రాన్ని గట్టెక్కించే బాధ్యత తీసుకొని ముందుకెళ్తున్నాం"

"ప్రతిపక్ష హోదా ఎవరో ఇచ్చేది కాదు.. ప్రజలు ఇవ్వాలి. వారికి ప్రతిపక్ష హోదాకు తగ్గట్లుగా సీట్లు ఇవ్వలేదు. ఇప్పటికీ బాధ్యత లేకుండా వైకాపా వాళ్లు మాట్లాడుతున్నారు" అని చంద్రబాబు మండిపడ్డారు.

## వైకాపా ఆర్థిక విధ్వంసంతో ఏపీ 30 ఏళ్లు వెనక్కి: పవన్



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 6 :** వైకాపా ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విమర్శించారు. ద్రవ్య వినిమియ బిల్లుపై శాసనసభలో ఆయన మాట్లాడారు. "గత ప్రభుత్వం రూ.9 లక్షల కోట్ల మేర అప్పులు మాపై ఉంచి వెళ్లింది. రూ.35 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. మేము రూ.25 వేల కోట్ల బిల్లులు చెల్లించాం. వైకాపా ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకపోవడం వల్ల వేల కోట్ల నిధులు నిరుపయోగమయ్యాయి" అని అన్నారు. "జలజీవన్ మిషన్ పథకాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఈ పథకానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ 5 కోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారు. న్యాయశాఖకు కూటమి ప్రభుత్వం చాలా ప్రాధాన్యత ఇస్తోంది. కొత్తగా కోర్టు భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి" అని పవన్ అన్నారు.

## ఏపీలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను ప్రోత్సహిస్తాం: మంత్రి నారా లోకేశ్

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 6 :** రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని ఏపీ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల వివరాలు, ఈఎంసీలో పరిశ్రమలకు ఇప్పటికే కేటాయించిన భూ విస్తీర్ణం, ఖాళీగా ఉన్న భూ విస్తీర్ణంపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో మూడు ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఉన్నాయన్నారు. ఏపీలో డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు ఉంది కాబట్టే... ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని, ఎలక్ట్రానిక్ ఎకో సిస్టమ్ ఏర్పాటు చేయాలని కేంద్రం కూడా ప్రోత్సహిస్తోందన్నారు. ఇందులో భాగంగా విశాఖలో ఏసిప్ అనే సంస్థకు భూములు కేటాయించినట్లు చెప్పారు. ⏭ తరువాయి 2లో..



## అనిల్ అంబానీ రిలయన్స్ పవర్‌పై ఈడీ దాడులు




**న్యూఢిల్లీ :** ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీ రిలయన్స్ పవర్‌కు సంబంధించి ముంబయి, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా 15 బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా అనిల్ ఫిబ్రవరి 27న ఈడీ విచారణకు హాజరుకావాల్సిఉంది. అయితే ఆయన గైర్హాజరైన నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి. అనిల్ అంబానీకి చెందిన కంపెనీలు రూ.వేల కోట్ల విలువైన బ్యాంకు రుణ మోసానికి పాల్పడ్డాయనే ఆరోపణలపై ఆయనపై ఈడీ కేసు నమోదైంది. వీటి మొత్తం విలువ రూ.40వేల కోట్లుగా పేర్కొంది.

## విద్య కోసం ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, విశాఖ సమాచారమ్, మార్చి 6 :** మిత్రుడి కోసం చివరి ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని, నేను కూడా మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మాదిగ ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో శిల్పకళావేదికలో సీఎంకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2023 ఎన్నికల్లో కష్టపడి ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని అన్నారు. చిత్తశుద్ధితో ప్రజల ముందుకు వచ్చాం కాబట్టే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు.



"మీ లక్ష్యాన్ని సాధించడానికి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. రిజర్వేషన్ల కోసం గల్లీ నుంచి దిల్లీ దాకా పోరాడారు. ప్రజాజీవితంలోకి వచ్చినప్పటి నుంచి మీ సమస్యను చూస్తూనే ఉన్నాను. మీ న్యాయమైన హక్కును సాధించడానికి మీతోపాటు నడిచా. కులాల వర్గీకరణకు సభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ. అన్ని సమస్యలకు వర్గీకరణ పరిష్కారం కాకపోవచ్చు. మీ సమస్యలు పరిష్కరించేటప్పుడు అడ్డుకునేవారిని మీరే నిలువరించాలి. బాధ్యతతో వ్యవహరిస్తే మీ జాతికి న్యాయం జరుగుతుంది. ప్రగతి ప్రణాళికలో నిర్లక్ష్యంగా ఉండొద్దు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంక్షేమ ఫలాలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యం. మీరు పన్నులు సక్రమంగా వసూలు చేసి ఖజానా నింపితే పేదలకు మేలు జరుగుతుంది. పంచడానికి ప్రభుత్వం వద్ద భూములు లేవు. చదువు ఒక్కటే ప్రజలకు ఇవ్వగలిగే ఆస్తి. విద్య కోసం ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నాం. ప్రభుత్వ ప్రణాళికలను అమలు చేసేది మీరే. భవిష్యత్‌లో మీ హక్కులకు చట్టబద్ధత కల్పిస్తాం. గత ప్రభుత్వం గొర్రెలు, బర్రెలు, చేప పిల్లలు ఇచ్చింది. కానీ, చెప్పులు కుట్టే ఈ జాతి ప్రజలు డాక్టర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కావాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు.



## 'తిరువూరు' వివాదాలు ముగిసిపోయినట్లే ఎమ్మెల్యే కొలికపూడి

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 6 :** 'తిరువూరు' వివాదాలు ముగిసిపోయినట్లేనని, గతం గతః అని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. అసెంబ్లీ లాబీలో ఏపీ తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆయన కలిశారు. నియోజకవర్గంలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలు, ఎంపీ కేశినేని చిన్నితో వివాదంపై చర్చించారు. కొలికపూడికి తాను చెప్పాల్సింది చెప్పానని పల్లా తెలిపారు.

తన నియోజకవర్గంలో ఎంపీకి ఇవ్వాల్సిన గౌరవం ఇస్తానని, ఆయన నుంచి కూడా అదే ఆశిస్తానని కొలికపూడి అన్నారు. తన చర్యలు పార్టీకి ఇబ్బంది కలిగించినందుకు చింతిస్తున్నానని, ఇకపై పునరావృతం కాకుండా జాగ్రత్తపడతానని తెలిపారు. ఇకపై ఏ సమస్య ఉన్నా జోనల్ కో ఆర్డినేటర్, జిల్లా పార్టీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్తానన్నారు. రాజకీయాల కోసం కులం కార్డు తీయడం తన అభిమతం కాదని స్పష్టం ⏭ తరువాయి 2లో..

## ఖమేనీ అడ్డు తొలగించాలని నవంబర్‌లోనే నిర్ణయించుకొన్నాం: ఇజ్రాయెల్



**ఇజ్రాయిల్ :** అమెరికా- ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోవడం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ కీలక విషయాలు బయటపెట్టారు. సుప్రీం నేత అడ్డు తొలగించాలని తాము గతేడాది నవంబర్‌లోనే నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.

ఓ మీడియాతో మాట్లాడుతూ.. గతేడాది చివర్లో ఓ ఉన్నతస్థాయి భద్రతా సమావేశం జరిగిందని కట్జ్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలో జరిగిన ఆ సమావేశంలో ఖమేనీ అడ్డు తొలగించాలని గట్టిగా నిర్ణయించుకొన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇరాన్ పై కొనసాగుతున్న ఆపరేషన్.. 2026 మధ్యలో జరగాల్సి ఉందన్నారు. అప్పట్లో ఈ ప్రణాళిక గురించి అమెరికాకు వెల్లడించలేదన్నారు. ఇటీవల ఇరాన్ పాలనను వ్యతిరేకిస్తూ ఆ దేశంలో నిరసనలు జరిగిన సంగతి తెలిసిందే. ఆ ఆందోళనలు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, నెతన్యాహుల మధ్య దీని గురించి చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఇరుదేశాలు సంయుక్తంగా ముందుగానే ఆపరేషన్ మొదలుపెట్టినట్లు వెల్లడించారు. ఆపరేషన్ తొలిరోజే ఖమేనీ కార్యాలయం లక్ష్యంగా అమెరికా- ఇజ్రాయెల్ భీకర దాడులు చేశాయి. ⏭ తరువాయి 2లో..

## భారత్ తీర సమీపంలో 1.5 కోట్ల బ్యారెల్ల రష్యా చమురు

**రష్యా :** ఇరాన్‌తో ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం నేపథ్యంలో.. చమురు రవాణాపై తీవ్ర ప్రభావం పడిన సంగతి తెలిసిందే. ఈ సంక్షోభం వేళ భారత్‌కు ఊరట లభించింది. యుద్ధం వేళ రష్యా చమురును దిగుమతి చేసుకునేందుకు భారత్‌కు అమెరికా మినహాయింపు ఇవ్వడంతో.. రష్యా నుంచి 1.5 కోట్ల బ్యారెల్ల చమురున్న డజనుకు పైగా ట్యాంకర్ నౌకలు బయల్దేరినట్లు బ్లూమ్‌బెర్గ్ కథనం వెల్లడించింది. అరేబియా సముద్రం మీదుగా మరికొన్ని రోజుల్లో అవి భారత్‌కు చేరుకోనున్నట్లు తెలుస్తోంది.

బ్లూమ్‌బెర్గ్ విడుదల చేసిన షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో డజనుకు పైగా ముడి చమురు ట్యాంకర్లు భారత్ తీరానికి సమీపంలో ఉన్నాయి. మరో వారం రోజుల్లో అవి ఓడరేవులకు చేరుకునే అవకాశం ఉంది. దాదాపు 7 మిలియన్ బారెల్ల రష్యన్ చమురును మోసుకెళ్లే మరో 8 నౌకలు




కూడా సింగపూర్ సముద్రప్రాంతంలో నిలిచిఉన్నాయి. అవికూడా త్వరలో భారత్‌కు రానున్నట్లు తెలుస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలుకు అమెరికా లైసెన్స్ జారీ చేయడానికి ముందే.. భారత ఓడరేవుల వైపు వచ్చే దిశగా రష్యా ⏭ తరువాయి 2లో..

## పిల్లలు సోషల్ మీడియా వాడకుండా చర్యలు: సీఎం చంద్రబాబు



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 6 :** పిల్లలు సోషల్ మీడియా వినియోగంపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. 13 ఏళ్లలోపు వారు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా నిషేధం విధించనున్నట్లు తెలిపారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా శాసనసభలో చంద్రబాబు మాట్లాడారు.

"13 ఏళ్ల లోపు వారికి సంబంధించి సోషల్‌మీడియా బ్యాన్ చేస్తే బాగుంటుందని సూచన వచ్చింది. ఆ వయసు లోపు వారికి సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతాం. 13-16 ఏళ్లలోపు వారికి సంబంధించి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. సోషల్‌మీడియా వల్ల మన పిల్లలు నష్టపోకూడదు. దానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది" అని సీఎం స్పష్టం చేశారు. టెక్నాలజీని వాడుకుంటే ఆయుధంగా పనిచేస్తుందని, బానిసైతే జీవితాలు నాశనమవుతాయన్నారు.

## దుర్గమ్మ సన్నిధిలో కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం

**విద్యాధరపురం, విశాఖ సమాచారమ్, మార్చి 6 :** విజయవాడలోని దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో 12 ఏళ్లకోసారి నిర్వహించే కుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నేటి నుంచి మూడు రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. తొలి రోజు శ్రీ కనక దుర్గానగర్ ప్రవేశ ద్వారం నుంచి వేదపండితులు, అర్చకులు పవిత్ర కలశాలను తీసుకుని ఇంద్రకీలాద్రికి చేరే 'కలశ ఊరేగింపు' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం యాగశాల, గణపతి పూజ, పుణ్యాహవచనం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ మహా కుంభాభిషేకం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. దేవస్థానం ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్, అధికారులు పాల్గొన్నారు.

**ఇంద్రకీలాద్రికి కంచి పీఠాధిపతి రాక**

జగద్గురు కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి శుక్రవారం సాయంత్రం ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఇంద్రకీలాద్రిపై ప్రతి 12 ఏళ్లకోసారి నిర్వహించే అత్యంత పవిత్రమైన "మహా కుంభాభిషేకం" వేడుకల్లో పాల్గొననున్నారు.

## రంపచోడవరం మన్యంలోనే పెద్ద పులి సంచారం



**గంగవరం, విశాఖ సమాచారమ్, మార్చి 6 :** రంపచోడవరం మన్యంలోనే పెద్ద పులి సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గంగవరం, అడ్డతీగల మండలాల పరిధిలో అది ఉన్నట్లు తెలుస్తోంది. గంగవరం మండలం మొల్లవరం, అడ్డతీగల మండలం తిమ్మాపురం పరిసరాల్లో రాత్రి పెద్దపులి సంచరించినట్లు స్థానికులు చెబుతున్నారు. పెద్దపులి పాదముద్రలు సేకరించే పనిలో అటవీ బృందాలు ఉన్నాయి. గంగవరం, అడ్డతీగల, గోకవరం, జగ్గంపేట, ఏలేశ్వరం మండలాల పరిధిలో జనం అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ విజ్ఞప్తి చేసింది. పులి మెడలోని రేడియో కాలర్ ద్వారా ఎక్కడ ఉందనేది అధికారులు తెలుసుకుంటున్నారు.

## యుద్ధం మొదలైనప్పటి నుంచి 200 మంది చిన్నారులు మృతి

**అమెరికా :** అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. యుద్ధం కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో చిన్నారులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం మొదలైన నాటినుంచి దాదాపు 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని తాజాగా యునిసెఫ్ పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఇరాన్‌లో 181 మంది మరణించినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో (7), ఇజ్రాయెల్ (3), కువైట్(1)లో మృతి చెందినట్లు తెలిపింది. యుద్ధాలు పిల్లలు ప్రారంభించరు.. కానీ, మూల్యం మాత్రం చెల్లిస్తున్నారు అని వ్యాఖ్యానించింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇదిలాఉండగా.. అమెరికా- ఇజ్రాయెల్ తొలిరోజు ఆపరేషన్‌లో ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న ఓ బాలికల పాఠశాలపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 160 మందికి పైగా విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది. ఈ దాడిపై తాజాగా యూఎస్ దళాలు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు యూఎస్ అధికారులు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

# నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో పుట్టినరోజు వేడుకలు



### పాల్గొన్న దివ్వెల మాధురి, తనూజ

తనూజతో కేక్ కట్ చేయిస్తున్న మాధురి

**తిరుమల, విశాఖ సమాచారమ్, మార్చి 6 :** దివ్వెల మాధురి, బిగ్‌బాస్ ఫేమ్ తనూజ తిరుమలలో తితిదే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. తనూజ పుట్టినరోజు సందర్భంగా తిరుమలకు కేక్ తీసుకువచ్చి అతిథిగృహంలో కట్చేశారు. కేక్‌ను తిరుమలకు తీసుకెళ్లడం, కట్ చేయడం తితిదే నిబంధనలకు విరుద్ధం. గురువారం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, మాధురి, తనూజ శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చి శ్రీపద్మావతి విచారణ కేంద్రం పరిధిలోని శ్రీవిభవ అతిథిగృహాన్ని తీసుకున్నారు. అందులో మాధురి.. తనూజతో కేక్‌ను కట్ చేయించారు. ఈ వేడుకను వీడియో తీయించి తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఈ వ్యవహారాన్ని తితిదే ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. గతంలోనూ దువ్వాడ శ్రీనివాస్, మాధురిలు శ్రీవారి ఆలయం ఎదుట ఫొటోషూట్ చేయడం వివాదాస్పదమైన విషయం తెలిసిందే.

## మండలిలో ప్రతిపక్ష నేత బొత్సకు అస్వస్థత

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 6 :** శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురయ్యారు. సభలో ప్రసంగిస్తూ అస్వస్థతకు గురవ్వడంతో అక్కడి అధికారులు అత్యవసరంగా అసెంబ్లీకి వైద్యులను పిలిపించారు. పరీక్షించిన వైద్యులు.. బీపీలో హెచ్చుతగ్గుల వల్లే అస్వస్థతకు గురైనట్లు వెల్లడించారు. ఆయనకు విశ్రాంతి అవసరమని స్పష్టం చేశారు. వైద్యుల సూచన మేరకు బొత్స ఇంటికి బయల్దేరారు. సభలో ప్రసంగించేటప్పుడు పరిస్థితిని గమనించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆయన్ను విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంది.



## సుఖోయ్ క్రాష్.. మృతుల్లో ఆపరేషన్ సిందూర్ పైలట్



**అస్సాం :** వాయుసేనకు చెందిన సుఖోయ్ యుద్ధ విమానం కూలిపోవడంతో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అస్సాంలోని కర్బి ఆంగ్లాంగ్ జిల్లాలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఆ పైలట్లలో ఒకరైన ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేశ్ దురాగ్‌కర్ (28).. గతేడాది పాక్‌పై భారత బలగాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నారు. పది రోజుల క్రితమే తన కుటుంబంతో సంతోషంగా గడిపి, విధుల్లో చేరారు.

పూర్వేశ్ తండ్రి రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ "గతేడాది భారత బలగాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో మా కుమారుడు కూడా పాల్గొన్నాడు. సిందూర్‌ను ఆపిన 15 రోజుల తర్వాత ఆ విషయం మాకు తెలిసింది. ఆ ఆపరేషన్ జరిగినన్ని రోజులూ పూర్వేశ్ మాతో టచ్‌లో లేడు. భారత వాయుసేనలో పనిచేస్తున్నందుకు, యుద్ధ విమానాలు నడుపుతున్నందుకు ఎంతో గర్వంగా ఫీల్ అయ్యేవాడు. మాతో ఆ అనుభవాలను పంచుకునేవాడు. బుధవారమే మేం అతడితో మాట్లాడాం. దేశ సేవలో తన ప్రాణాలు అర్పించాడు. అందరికీ నా బిడ్డ ఒక స్ఫూర్తిగా నిలుస్తాడు. సుదీర్ఘంగా దేశానికి సేవలందించాలని ఆశించాడు. కానీ ఆ కల తీరలేదు" అని రవీంద్ర తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

మహారాష్ట్రలోని నాగ్‌పూర్ పూర్వేశ్ స్వస్థలం. పది రోజుల క్రితమే కుటుంబ సభ్యులు నిర్వహించిన గెట్‌టుగెదర్‌లో సంతోషంగా గడిపారు. గురువారం రాత్రి సుఖోయ్ ఆచూకీ లేకుండా పోయింది. ట్రైనింగ్ మిషన్‌లో భాగంగా జొర్హాట్ ఎయిర్‌బేస్ నుంచి టేకాఫ్ అయిన వెంటనే మిస్ అయింది. 60 కి.మీ.దూరంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పూర్వేశ్‌తో పాటు స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ ప్రాణాలు కోల్పోయారు.

## ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచండి.. రిఫైనరీలను కోరిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన మార్కెట్‌లో అనిశ్చితి నెలకొంది. దీంతో వంటగ్యాస్ లభ్యతను నిర్ధరించేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలను ఆదేశించింది. దేశీయ సరఫరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ ఎల్‌పీజీ ప్రభుత్వరంగ కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు మాత్రమే విక్రయించాలని తన ఆదేశాల్లో పేర్కొంది. ఆ సరఫరాలు దేశీయ వినియోగదారులకు మాత్రమే చేరేలా చూడాలని ఆ మూడు సంస్థలకు సూచించింది.

ఎల్‌పీజీని ఉత్పత్తి చేయడానికి కీలకమైన ప్రొపేన్, బ్యూటేన్‌ను పెట్రో కెమికల్ ప్రొడక్షన్ కోసం దారి మళ్లించవద్దని కేంద్రం రిఫైనరీలకు స్పష్టం చేసింది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన వంటి పథకాల ద్వారా దేశంలో ఎల్‌పీజీ గృహ వినియోగం గణనీయంగా పెరిగింది. ఈ ఇంధన అవసరాలు తీర్చుకునేందుకు 60 శాతం దిగుమతుల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి. దాంతో అంతర్జాతీయంగా ధరలు పెరిగినా, రవాణాలో అంతరాయాలు ఏర్పడినా దేశీయంగా ఆ ప్రభావం కనిపిస్తుంటుంది.




## టెక్ రంగంలో మరో షాక్

### వేలాది ఉద్యోగుల తొలగింపు! బ్లూమ్‌బెర్గ్ తాజా నివేదికల ప్రకారం, ఒరాకిల్ సంస్థ రాబోయే కొద్ది వారాల్లోనే భారీ ఎత్తున ఉద్యోగులను తొలగించబోతోంది

గత కొన్నాళ్లుగా ఐటీ రంగంలో లేఆఫ్స్ పరంపర కొనసాగుతూనే ఉంది. దిగ్గజ సంస్థలైన అమెజాన్, యూపీఎస్ బాటలోనే ఇప్పుడు మరో టెక్ జెయింట్ 'ఒరాకిల్' కూడా భారీ స్థాయిలో ఉద్యోగుల కోతకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. డేటా సెంటర్ల నిర్వహణ ఖర్చు పెరగడం, ఏఐ విప్లవం వంటి కారణాలతో వేలాది మందిని ఇంటికి పంపేందుకు కంపెనీ ప్లాన్ చేస్తోంది. ఈ వార్త ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఆ వివరాలు ఇలా వున్నాయి.. వేల సంఖ్యలో ఉద్యోగాల కోత.. షాక్‌లో ఐటీ జనం: బ్లూమ్‌బెర్గ్ తాజా నివేదికల ప్రకారం, ఒరాకిల్ సంస్థ రాబోయే కొద్ది వారాల్లోనే భారీ ఎత్తున ఉద్యోగులను తొలగించబోతోంది. ఈ తొలగింపులు వేల సంఖ్యలో ఉండవచ్చని సమాచారం. ఇక ఇప్పటికే అమెజాన్ వంటి సంస్థలు 30 వేల మంది వరకు తొలగించగా, ఒరాకిల్ కూడా అదే స్థాయిలో అంటే దాదాపు 30 వేల మంది ఉద్యోగులపై వేటు వేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రక్రియ ఈ నెల నుండే ప్రారంభం కావచ్చని వార్తలు వస్తుండటంతో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఒరాకిల్ ఉద్యోగులు ఊపిరి బిగబట్టి అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

ఏఐ విప్లవం.. పెరిగిన ఖర్చులే కారణమా: ఒరాకిల్ వంటి పెద్ద కంపెనీ ఎందుకు ఇంత కఠిన నిర్ణయం తీసుకుంటోంది అనే ప్రశ్న అందరిలోనూ మెదులుతోంది. దీనికి ప్రధానంగా రెండు కారణాలు వినిపిస్తున్నాయి. ఒకటి, డేటా సెంటర్ల నిర్వహణ వ్యయం భారీగా పెరగడం. రెండోది, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం. ఏఐ రాకతో పాత పద్ధతుల్లో చేసే పనులు తగ్గిపోవడం, ఆటోమేషన్ పెరగడంతో మానవ వనరుల అవసరం తగ్గుతోందని కంపెనీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఖర్చులను తగ్గించుకుని లాభాల బాట పట్టేందుకు ఈ 'సైజింగ్ డౌన్' ఆపరేషన్ చేపడుతున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. టెక్ రంగం భవిష్యత్తుపై నీలినీడలు: ఒకవైపు కొత్త టెక్నాలజీలు వస్తున్నాయని సంతోషపడాలో, లేక ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని బాధపడాలో తెలియని స్థితిలో ఐటీ రంగం ఉంది. ఒరాకిల్ నిర్ణయం కేవలం ఆ కంపెనీకే పరిమితం కాకుండా, మొత్తం టెక్ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసే అవకాశం ఉంది. పెద్ద కంపెనీలే ఇలా ఉద్యోగాలను కోత విధిస్తుంటే, స్టార్టప్‌ల పరిస్థితి ఏంటనే చర్చ మొదలైంది. ఇక అయితే, కంపెనీ నుండి ఇంకా అధికారికంగా కచ్చితమైన సంఖ్య వెలువడలేదు. కానీ, పరిస్థితులు చూస్తుంటే ఐటీ నిపుణులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాల్సిన అవసరం ఉందనేది స్పష్టమవుతోంది. టెక్ ప్రపంచంలో మార్పులు సహజమే అయినా, ఇలాంటి భారీ లేఆఫ్స్ వార్తలు ఎప్పుడూ బాధగానే ఉంటాయి. ఇక ఒరాకిల్ నుండి వచ్చే అధికారిక అప్‌డేట్ కోసం వేచి చూడాల్సిందే.




## భారత్ తీర సమీపంలో 1.5 కోట్ల బ్యారెళ్ల రష్యా చమురు

(మొదటి పేజీ తరువాయి)

నౌకలు తమ గమ్యస్థానాలను మార్చినట్లు బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది. 2022 నుంచి రష్యా చమురును భారత్ గణనీయంగా దిగుమతి చేసుకుంటుంది. అయితే.. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇటీవల ఈ దిగుమతులు తగ్గాయి. ప్రస్తుతం పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలోనే రష్యా మళ్లీ ఎగుమతి చేస్తుండడంతో భారత్‌కు చమురు కష్టాలు తొలగిపోయే అవకాశం ఉంది.

## ఖమేనీ అడ్డు తొలగించాలని ..

(మొదటి పేజీ తరువాయి)

ఈ దాడుల్లో ఖమేనీతో సహా ఆయన కుటుంబంలోని పలువురు ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌లోని ట్రాఫిక్ కెమెరాలు, ఫోన్ నెట్‌వర్క్‌ను ట్రాక్ చేసి ఖమేనీ కదలికలపై నిఘా పెట్టి.. అత్యంత కచ్చితత్వంతో ఈ దాడి చేసినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ కూడా దాడులు చేస్తోంది. దీంతో ప్రస్తుతం పశ్చిమాసియాలో పరిస్థితులు రణరంగాన్ని తలపిస్తున్నాయి.

## 'తిరువూరు' వివాదాలు ముగిసిపోయినట్లే ఎమ్మెల్యే కొలికపూడి

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ విధానానికి తాను పూర్తి వ్యతిరేకినన్నారు. తన చుట్టూ ఉన్న ఒకరిద్దరు, ఎంపీ చుట్టూ ఉన్న ఒకరిద్దరి వల్ల ఇప్పటి వరకు సమస్యలు వచ్చి ఉండొచ్చని, తన వైపు నుంచి అలాంటి సమస్యలు ఇకపై పునరావృతం కావని స్పష్టం చేశారు.

## ఏపీలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ ..

(మొదటి పేజీ తరువాయి)

ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని, చిన్న చిన్న సమస్యలు ఏమైనా ఉంటే.. యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని అన్నారు.

## అమెరికా ఏం చెప్తే భారత్ అది చేయాలా .. సొంత నిర్ణయం ఉండదా ?

**అమెరికా :** అమెరికా తాజా ప్రకటన భారత్‌కు పెద్ద ఊరటనిచ్చింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవచ్చని అమెరికా ప్రకటించింది. కానీ షరతు విధించింది. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన నౌకల నుంచే కొనుగోలు చేయాలన్నది షరతు. అప్పుడు రష్యాకు పెద్దగా లబ్ది జరగదని అమెరికా భావన. ఈ ప్రకటన భారతదేశానికి ఊరటనిచ్చేది. ఎందుకంటే.. భారత చమురు, గ్యాస్ దిగుమతులు ఎక్కువగా హోర్మూజ్ జలసంధి నుంచే వస్తాయి. ఇప్పుడు ఇరాన్ హోర్మూజ్ జలసంధిని మూసివేసింది. దీని వల్ల దిగుమతులు ఆగిపోయి భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతాయి. ప్రత్యామ్నాయంగా రష్యా నుంచి దిగుమతి చేసుకుంటే ఇరాన్ ప్రభావం నామమాత్రంగా ఉంటుంది.

భారత్‌కు స్వతంత్రత లేదా భారతదేశం ఎవరి నుంచి చమురు కొనుగోలు చేయాలో, ఎవరి నుంచి కొనుగోలు చేయకూడదో అమెరికా చెప్పడం విడ్డూరం. భారతదేశానికి ఎక్కడ కొనుగోలు చేస్తే ప్రయోజనకరమో అక్కడ కొనుగోలు చేయాలి. అంతే తప్పా.. అమెరికా చెప్పనట్టు కొనుగోలు చేస్తే వెనుజులాకు, ఇండియాకు మధ్య పెద్ద తేడా ఏం ఉంటుంది ?. అమెరికా వెనుజులా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి తన మాట వినేలా చేసుకుంది. భారత్‌లో టారిఫ్‌ల భయం చూపి తన మాట వినేలా చేసుకుంటోంది. వ్యాపారంలో ఏది ప్రయోజనకరమో అది చేయడమే ఉత్తమ వ్యాపార లక్షణం. ఎవరి కోసమో ఇష్టం లేకపోయినా కొనుగోలు చేస్తే అది వ్యాపారం కాదు. ఇప్పుడు భారత్ చేస్తున్నది అలాగే ఉంది. అమెరికా ఎత్తుగడ స్పష్టంగా అర్థమవుతోంది. ఉక్రెయిన్, రష్యా యుద్ధ సాకుతో రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయొద్దని ఒత్తిడి చేసింది. భారత్ కూడా ఒప్పుకుంది. ఆ స్థానంలో వెనుజులా చమురు భారత్ కు అమ్మాలన్నది అమెరికా యోచన. ఇక్కడ రష్యా చమురు వల్ల భారత్‌కు ప్రయోజనమా?. వెనుజులా చమురు వల్ల భారత్ కు ప్రయోజనమా అన్నది ముఖ్యం. వెనుజుల చమురు నుంచి రష్యా చమురు కంటే ఎక్కువ ప్రయోజనం ఉంటే కొనుగోలు చేస్తే అది తప్పు కాదు. ప్రయోజనం లేకున్నా అమెరికా కోసం కొనుగోలు చేస్తే ఒకచోట లాభం ఇంకో చోట నష్టంగా మారుతుంది. భారత్ తేల్చుకోవాల్సిన అంశం మనం ఏం కొనాలో, ఎవరితో కొనాలో చెప్పే హక్కు అమెరికాకు లేదు. అది పూర్తిగా సొంత నిర్ణయం. దేశానికి ఏది ప్రయోజనమో, ఎక్కడ తక్కువకు దొరుకుతుందో, మన అవసరాలను ఎంత మెరుగ్గా తీరుస్తుందో అది ముఖ్యం. అంతే కానీ అమెరికా చెప్పిందని కొనడం అంటే మన హక్కులను మనమే కాలరాసుకోవడం. ఈ విషయంలో భారత్ చాలా సీరియస్ గా ఆలోచించాలి. ఎందుకంటే ఇప్పుడు ఆయిల్ కొనొద్దు అంటారు. రేపు ఇంకో దేశం నుంచి ఇంకోటి కొనద్దని చెబుతారు. ఇది చాలా ప్రమాదకరం. మన ప్రయోజనాల్ని తాకట్టు పెట్టే అంశం. మన ఎగుమతులు అమెరికా మార్కెట్ మీద ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. కాబట్టే అమెరికా టారిఫ్‌ల పేరుతో మనల్ని శాసిస్తోంది. ఎగుమతులు, దిగుమతుల విషయంలో ఒకే దేశం మీద ఆధారపడకుండా ఉంటే అప్పుడు ఇలాంటి ఆదేశాలను పాటించాల్సిన అవసరం ఉండదు. మన ప్రయోజనాల్ని మనం కాపాడుకోవచ్చు. అమెరికాకు చెక్ పెట్టాలంటే.. ముందుగా ఎగుమతులు, దిగుమతుల విషయంలో రిస్క్ డైవర్షిఫికేషన్ ఉండాలి. అప్పుడే దేశ ప్రయోజనాలు కాపాడుకోగలం.

విశాఖ సమాచారమ్
శనివారం 7-3-2026

# నిజం నిప్పులాంటిది.. నివేదికలే సాక్ష్యం!

తిరుమలలో లడ్డులో కల్తీ నెయ్యి, జంతు కొవ్వు కలిసిన సంఘటనపై ల్యాబ్ నివేదికల ప్రకారం కేసులు నమోదు, సిట్ విచారణ, భక్తుల విశ్వాసానికి హాని చేసిన బాధ్యత వైసీపీ అధికారంపై ఉంది.

తిరుమల పవిత్రతపై జరిగిన దాడికి బాధ్యులెవరు? అంటూ ఒక భక్తుని ఆవేదన! కోట్లాది మంది భక్తులు తమ జీవితంలో ఒకసారి అయినా తిరుమల ప్రసాదాన్ని స్వీకరించాలని కోరుకుంటారు.. అది భక్తి భావానికి ప్రతీక. అందుకే తిరుమలలో అత్యంత పవిత్రంగా తయారయ్యే లడ్డు విషయంలో భక్తుల విశ్వాసం అత్యంత పవిత్రమైనది. ఆ విశ్వాసాన్ని కాపాడటం ప్రతి ప్రభుత్వానికి బాధ్యత..

కలియుగ వైకుంఠంగా వాసికెక్కిన తిరుమల పుణ్య క్షేత్రంలో గత ఐదేళ్ల పాలనలో జరిగిన ఘోర అపచారం కోట్లాది మంది హిందువుల గుండెల్లో మంటలు రేపింది. శ్రీవారి ప్రసాదం అంటే కేవలం తినే పదార్థం కాదు, అది భక్తుల నమ్మకం, పరమ పవిత్రం. అటువంటి ప్రసాదం తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ల్యాబ్ రిపోర్టుల ద్వారా తేలడం నాగరిక సమాజం తలదించుకోవాల్సిన విషయం. తిరుమలలో జరిగిన ఈ మహా పాపంపై పశ్చాత్తాపం చెందాల్సింది పోయి, మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, ఆయన పార్టీ నాయకులు చేస్తున్న బుకాయింపులు భక్తుల మనోభావాలను మరింత గాయ పరుస్తున్నాయి..

**బుకాయింపులు పనిచేయవ్!**

భక్తుల మనోభావాలతో ఆడుకుంటూ, తప్పు చేసి కూడా సమర్థించుకోవడం అనేది మరింత దారుణం. వైసీపీ నాయకుల బుకాయింపులు చెల్లవు.. వారు చేసింది మహాపరాధం. కల్తీ లడ్డు అనే ఆరోపణలు వచ్చినప్పుడు మొదటగా సంబంధిత అధికారులు పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షలకు పంపారు. నెయ్యి నాణ్యత ఏమిటి? ఉపయోగించిన పదార్థాలు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా? అన్న విషయాలు ల్యాబ్ పరీక్షల ద్వారా నిర్ధారించబడ్డాయి. ఈ పరీక్షల నివేదికలు స్పష్టంగా చెబుతున్న విషయం ఏమిటంటే అభిప్రాయాలు కాదు, నివేదికలే నిజాలకు అద్దం పడుతున్నాయి..

**ల్యాబ్ రిపోర్టు ఆధారంగానే కేసు..**

గుజరాత్‌లోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ) ఇచ్చిన నివేదికలో నెయ్యిలో జంతువుల కొవ్వు లార్డ్, చేప నూనె ఉన్నాయని శాస్త్రీయంగా నిరూపితమైంది. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీ సృష్టించిన రిపోర్ట్ కాదు.. భక్తులు, పోటు కార్మికులు చేసిన ఫిర్యాదుల మేరకు టీటీడీకి సరఫరా చేస్తున్న నెయ్యి ట్యాంకర్ల నుంచి 2024 జులై 16, 23 తేదీల్లో నమూనాలు తీసి సీల్డ్ కవర్లో ఎన్డీబీ-సీఏఎల్ఎఫ్ ల్యాబ్‌కి పంపగా, టీటీడీకి సరఫరా చేసే నెయ్యిలో వనస్పతి, జంతు కొవ్వుతో కల్తీ చేసినట్లు ల్యాబ్ నివేదిక ఇచ్చింది. దాని ఆధారంగానే కేసు నమోదు చేసి సిట్ విచారణకు ఆదేశించింది కూటమి ప్రభుత్వం. పామోలిన్, ఇతర రసాయనాలతో తయారు చేసిన 60 లక్షల కిలోల నెయ్యి అనే పదార్థాన్ని డెయిరీలు సరఫరా చేశాయని.. దానితోనే 20 కోట్ల లడ్డూలు తయారు చేసినట్లు, అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న కల్తీ నెయ్యి సరఫరాదారుల్ని బెదిరించి వసూళ్ల కు పాల్పడినట్లు కూడా సిట్ విచారణలో వెల్లడైంది.

**డైవర్షన్ పాలిటిక్స్ ఎక్కడ.. ఎవరివి?**

కానీ సాక్ష్యాలు కళ్లముందు కనిపిస్తున్నా, వైసీపీ నాయకులు ఇది డైవర్షన్ పాలిటిక్స్ అనడం బాధ్యతా రాహిత్యం. చేసిన తప్పును ఒప్పుకోలేక, దాన్ని కప్పిపుచ్చుకోవడానికి దేవుడిపైనే నిందలు వేయడం ఎంతవరకు సమంజసం? దీనిని రాజకీయ కోణంలో చూస్తూ తప్పించు కోవాలని చూస్తున్నారు.. కానీ ఇది రాజకీయాలకు అతీతమైన అంశం. ఒక మాజీ ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి, తన హయాంలో జరిగిన ఈ ఘోర అపచారానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉంది.

**అపచారాలు ఎన్నో..**

కల్తీ నెయ్యి వెనుక కుట్రలు, నివేదికలు వెనుక ఉన్న భయంకరమైన నిజాలు నెయ్యి సరఫరాలో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చేలా నిబంధనలు సడలిస్తూ కొనుగోలు కమిటీ సిఫారసు చేసింది. పామోలిన్, పామ్ కెర్నల్ ఆయిల్, బీటా కెరోటిన్, ఫ్లేవరింగ్ ఏజెంట్ల వంటి ఇతర రసాయనాలు ఉపయోగించి నెయ్యిని పోలి ఉండే రసాయనం తయారు చేసారని, ఇది నేరపూరిత కుట్రగా సిట్ తేల్చింది. శాస్త్రీయ నివేదికలు కల్తీ లడ్డు పాపాన్ని సాక్ష్యాలతో సహా బయట పెట్టాయి. వైసీపీ వారు చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఆధునిక సాంకేతికత, ల్యాబ్ నివేది కల ముందు అబద్ధాలు నిలవ లేవు..

అపవిత్ర పాలనలో అపచారాలు ఎన్నో, వైసీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే తిరుమల బోర్డు టీటీడీ నియామకాల్లో రాజకీయ జోక్యం మితిమీరిపోయింది. ధార్మిక చింతన లేని వ్యక్తులకు పగ్గాలు అప్పగించడం వల్లనే ఈ రోజు ఇలాంటి దుస్థితి దాపురించింది. నెయ్యి కొనుగోలు ప్రక్రియలో నాణ్యత కంటే కమీషన్లకే ప్రాధాన్యత ఇచ్చారన్నది బహిరంగ రహస్యం.

**మితిమీరిన రాజకీయ జోక్యం!**

గత ప్రభుత్వం అనుసరించిన రివర్స్ టెండరింగ్ విధానం, తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేస్తామన్న కంపెనీలను ప్రోత్సహించడం వెనుక ఉన్న మతలబు ఏమిటి? కల్తీ నెయ్యితో లడ్డూలు తయారు చేసి కోట్లాది మంది హిందువుల మతాచారాలను భ్రష్టు పట్టించిన ఈ చర్యను కేవలం పొరపాటుగా చూడలేం, ఇది ఒక వ్యవస్థీకృత నేరం అని చెప్పాలి. ఈ మహా పాపానికి కారకులైన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించబడాలి. అప్పుడే భవిష్యత్తులో ఇలాంటి సాహసాలు ఎవరూ చేయలేరు.. నివేదికల రూపంలో బయటపడిన ఈ నిజాలు ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావాలి.

# నెహ్రూ,పటేల్ మధ్య విభేదాలు నిజమేనా?

జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇద్దరూ స్వాతంత్ర్య సమరయోధులు. మహాత్మా గాంధీజీకి అత్యంత సన్నిహితులు. నెహ్రూ,పటేల్ మధ్య అప్పట్లో సఖ్యత లేదనే చర్చలు ఇటీవల సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్నాయి. నెహ్రూ బదులు పటేల్ ప్రధాని అయి ఉంటే దేశం పరిస్థితి మరోలా ఉండేదని భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇవన్నీ అభూత కల్పనలని, వారిద్దరి మధ్య సఖ్యత ఉండడం వల్ల స్వాతంత్ర్య అనంతరం తొలినాళ్లలో పాలన సవ్యంగా సాగిందని ప్రముఖ వ్యాసకర్త రామచంద్ర గుహ ఒక వ్యాసంలో పేర్కొన్నారు. అందుకు ఉదాహరణగా వారిద్దరి మధ్య నడిచిన ఉత్తరాల గురించి ప్రస్తావించారు. గాంధీ గతించగానే పటేల్ కు నెహ్రూ ఉత్తరం రాస్తూ "బాపు కనుమరుగయ్యాక అంతా మారిపోయింది. ఇప్పుడు క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొనాల్సి ఉంటుంది. పాత విభేదాలను మరచి మనందరం మరింత సఖ్యతతో పనిచెయ్యాల్సిఉంది " అని రాసారు. దానికి పటేల్ ప్రతిగా జవాబు ఇలా రాసారు. "హృదయంలోని భావనను చక్కగా చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చాక నిజానికి కొన్ని విషయాలు నాకూ నచ్చడం లేదు. బాధ్యతలనుంచి తప్పించమని బాపుకు ఉత్తరం కూడా రాసాను. అంతలో గాంధీజీ అంతర్ధానం కావడంతో పరిస్థితులు మరింత మారాయి. ఈ సంక్షోభం మనల్ని పూర్తిగా కమ్మేయకమునుపే మనం కళ్లు తెరచి కలిసి సాగితే ఏమి సాధించగలమో బోధపడుతుంది. ఈ బాధాతప్త సమయంలో సంఘటితంగా సాగాలి"అని ఉత్తరం రాసారు.

ఆ సమయంలో దేశం చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. దేశం కరువు, ద్రవ్యనిలువల లోటు, మతతత్వం, వైషమ్యాలతో అతలాకుతలం గా ఉంది. అనేక సవాళ్లు ఎదుర్కొవాల్సిఉంది. నెహ్రూ,పటేల్, అంబేద్కర్ కలిసి పనిచేయడం వల్ల ఆ మాత్రమన్నా దేశం పురోగమించిందని తన వ్యాసంలో రామచంద్రగుహ అభిప్రాయపడ్డారు.

నెహ్రూ,పటేల్ చివరివరకూ ప్రభుత్వంలో కొనసాగి దేశానికి దిశానిర్దేశం చెయ్యడం గమనార్హం. పటేల్ , నెహ్రూ కన్నా గాంధీజీకి జె.బీ.కృపాలనీ ముందే పరిచయం. దక్షిణాఫ్రికా నుంచి రాగానే శాంతినికేతన్ లో కృపాలనీని కలిసారు. కృపాలనీతో కలసి చంపారన్ ఉద్యమంలో గాంధీ కలిసి పని చేసారు. చాలా ఏళ్లు పటేల్, నెహ్రూ,కృపాలనీ కలసి కారాగారంలో ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కృపాలనీ కాంగ్రెస్ పార్టీ వీడారు. నెహ్రూతో విభేదించారు. రక్షణ శాఖామంత్రి వి.కే.కృష్ణమీనన్ వైఫల్యాలను ఎండగట్టారు.

గాంధీజీ హత్యకు గురైన రోజు నెహ్రూ,పటేల్ మధ్య విభేదాలు ఉన్నాయని"లండన్ టైమ్స్ " పత్రిక చేసిన వ్యాఖ్య ఆయనను కలవరపరిచినది. దీనిపై చర్చించడానికి సాయంత్రం 4 గంటలకు పటేల్ ను గాంధీ బిర్లా భవన్లో కలిసారు. పటేల్ తన కుమార్తె మణిబెన్ తో వచ్చారు. గాంధీ,పటేల్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. మధ్యలో సాయంకాలపు ప్రార్థన కోసం గాంధీజీ వెళుతుండగా గాడ్సే తుపాకీ గుళ్లకు బలయ్యారు. అనుకున్నట్టు గాంధీ తో నెహ్రూ సమావేశం జరగలేదు. లండన్ టైమ్స్ వ్యాసంలో రాసినట్టు వీరిద్దరి మధ్య విభేదాల చర్చ ఇప్పటికీ నడుస్తునే ఉంది. తప్పనిసరైన పరిస్థితుల్లో మెరుగైన ప్రత్యామ్నాయం గా మత విద్వేషాల నేపథ్యంలో నెహ్రూ ప్రధాని అయ్యారు. అలాగే పటేల్, నెహ్రూ మధ్య వయస్సు అంతరం కూడా 14 సంవత్సరాలు ఉందనే విషయం గమనార్హం. గాంధీ కన్నుమూసిన రెండేళ్లకు పటేల్ గతించారు. దాంతో నెహ్రూ ఆలోచనా రీతులు దేశంలో ప్రస్ఫుటంగా ప్రతిబింబించాయి.

స్వాతంత్ర్యం సమయంలో నాయకులు మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నా గాంధీ వారందరినీ ఏకత్రాటిపై తీసుకువచ్చారు. ఆనాటి నాయకుల మధ్య విభేదాలు ఉన్నా అవి విధానపరమైనవే గానీ రాజకీయపరమైనవి కాదు. ఒకరి అభిప్రాయం మరొకరు గౌరవించేవారు. ఒకవేళ వచ్చినా చర్చల ద్వారా పరిష్కరించుకునే వారు. అంబేద్కర్ కొన్ని విషయాల్లో గాంధీతో విభేదించినా ఆయన కోరిక మేరకు కేంద్ర మంత్రిగా కొనసాగారు. అలా ఆనాటి నాయకులు సంయమనం పాటించేవారు గానీ నేటి తరం లాగా వీధిలో పడేవారు కాదు. చిన్న విభేదాలు కే పార్టీని వీడేవారుకాదు. సిద్ధాంతానికి కట్టుబడి ఉండేవారు. మహా నాయకులుగా పేరుపడ్డ పటేల్, నెహ్రూ మధ్య విభేదాలు ఎంతవరకు నిజమో తెలియదుగానీ చర్చలు,వ్యాఖ్యల పేరిట వారిద్దరి వ్యక్తిత్వం హననం చెయ్యడం సమంజసం కాదు. పటేల్ హైదరాబాద్ తో సహా భారతీయ సంస్థానాలను భారత్లో విలీన ప్రక్రియలో కీలకంగా వ్యవహరించారు. అలాగే భారత్ ను అటు పెట్టుబడిదారి,ఇటు కమ్యూనిస్టు వ్యవస్థల వాసనలు అంటకుండా గాంధీ ఆలోచనా విధానంలో పంచవర్ష ప్రణాళిక లతో అభివృద్ధి పథంలో నడిపించిన నేత నెహ్రూ. ఈ ఇద్దరి నేతలకూ భారతీయులు రుణపడి ఉంటారు శతథా...సర్వధా...

**యం.వి.రామారావు**

# జాతీయ దంత వైద్యుల దినోత్సవం - నోటి ఆరోగ్యం

ప్రతి సంవత్సరం మార్చి 6న జాతీయ దంత వైద్యుల దినోత్సవం జరుపుకుంటారు. దంత ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించడం మరియు ప్రజల చిరునవ్వులను కాపాడటంలో దంతవైద్యులు చేస్తున్న అంకితభావంతో కూడిన సేవలను అభినందించడానికి ఈ రోజు ప్రత్యేకించబడింది. నేటి డిజిటల్ యుగంలో దంత వైద్యం నవ్య టెక్నాలజీలను ఆకళింపు చేసుకొని చికిత్సా పద్ధతుల్లో విప్లవాత్మక మార్పులను స్వతం చేసుకుంటున్నది. మన ఆరోగ్యకర చిరునవ్వుకు కారణమైన దంత వైద్యులు చేస్తున్న సేవలకు తగు రీతిలో కృతజ్ఞతలు తెలియజేయడం మన కనీస ధర్మం.

నోటి పరిశుభ్రత యొక్క ప్రాథమిక అంశాలు అందరికీ తెలిసినవే.
నోటి ఆరోగ్యం మొత్తం శరీర ఆరోగ్యానికి చాలా ముఖ్యం.
రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడం,
క్రమం తప్పకుండా ఫ్లాస్ చేయడం మరియు దంతవైద్యుడిని సందర్శించడం.
అయితే, దాగి ఉన్న నోటి ఆరోగ్యం యొక్క అంశాల సంగతేంటి?
ఆ అద్భుతమైన చిరునవ్వు వెనుక
కొన్ని అంతర్లీన సమస్యలు ఉండవచ్చు. మీ నోటి ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే
ఈ 10 అంతగా తెలియని అంశాలను పరిశీలిద్దాం.

**నాలుక అంశం:**

నాలుక నోటి పరిశుభ్రతలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందనే వాస్తవాన్ని విస్మరిస్తూ మనం ఎల్లప్పుడూ దంతాలు మరియు చిగుళ్ళపై దృష్టి పెడతాము. ఇది దుర్వాసన మరియు ఇతర నోటి సమస్యలకు దోహదపడే బ్యాక్టీరియా, ఆహార కణాలు మరియు చనిపోయిన కణాలను కలిగి ఉంటుంది. తాజా శ్వాస మరియు ఆరోగ్యకరమైన నోటి కోసం ప్రతిరోజూ స్క్రాపర్ లేదా మృదువైన-బ్రిస్టల్ టూత్ బ్రష్‌తో మీ నాలుకను సున్నితంగా శుభ్రం చేయండి.

**టూత్‌పేస్ట్ ఎంపిక ముఖ్యం:**

అన్ని టూత్‌పేస్ట్‌లు ఒకేలా సృష్టించబడవు. ఫ్లోరైడ్ కంటెంట్ ఉన్నదాన్ని ఎంచుకోండి. రెండోది ఎనామెల్‌ను బలపరుస్తుంది- ఇది మీ దంతాల యొక్క కఠినమైన బాహ్య భాగం, ఇది కుళ్ళిపోకుండా కాపాడుతుంది. మీ నిర్దిష్ట అవసరాల ఆధారంగా సిఫార్సుల కోసం మీ దంతవైద్యుడిని సంప్రదించండి.

చక్కెరల పట్ల జాగ్రత్త వహించండి:

చక్కెర ఎల్లప్పుడూ మిఠాయిలా స్పష్టంగా ఉండదు. చక్కెర స్వీట్లలోనే కాదు, అనేక ప్రాసెస్ చేసిన ఆహారాలు మరియు పానీయాలలోనూ కనిపిస్తుంది. మీరు కొనుగోలు చేసే పదార్థాల జాబితాలను చదవడం ద్వారా మరియు సాధ్యమైనప్పుడల్లా చక్కెర లేని ఎంపికల కోసం వెళ్లడం ద్వారా జాగ్రత్తగా ఉండండి.

**ఫ్లాసింగ్:**

ఫ్లాసింగ్ ఒక పనిలా అనిపించవచ్చు కానీ దంతాల మధ్య మరియు మీ టూత్ బ్రష్ చేరుకోలేని చిగుళ్ల రేఖ కింద ఉన్న ఫలకం మరియు ఆహార కణాలను వదిలించుకోవడం చాలా ముఖ్యం. ఫ్లాసింగ్‌ను దాటవేయడం వల్ల చిగుళ్ల వ్యాధి లేదా కావిటీస్ ఏర్పడవచ్చు కాబట్టి మీ దినచర్యలో దానికి ప్రాధాన్యత ఇవ్వండి.

**ఆహారం - నిశ్శబ్ద అపరాధి:**

ఆరోగ్యకరమైన దంత అలవాట్లు సమతుల్య ఆహారంపై ఆధారపడి ఉంటాయి. చక్కెర మరియు ఆమ్ల ఆహారాలు దంత మరియు చిగుళ్ల వ్యాధులకు కారణమవుతాయి. పాలు, జున్ను మరియు ఆకుకూరలు వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారాలను ఎక్కువగా చేర్చండి, ఇవి దంతాలు మరియు ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి.

నీటిని మర్చిపోవద్దు! ఇది హానికరమైన బ్యాక్టీరియాను శుభ్రపరుస్తుంది మరియు మన నోటిలోని ఆమ్లాలను తటస్థీకరిస్తుంది.

**నోరు పొడిబారడం:**

నోరు పొడిబారడం అనేది దాహం మాత్రమే కాదు, నోరు తగినంత లాలాజలాన్ని ఉత్పత్తి చేయకపోవడం వల్ల ఎక్కువ కావిటీస్ మరియు చిగుళ్ల వ్యాధులు వస్తాయి. లాలాజలం ఆహార కణాలను కడగడం, ఆమ్లాలను తటస్థీకరించడం మరియు దంతాల ఎనామిల్ యొక్క పునఃఖనిజీకరణను పెంచడంలో సహాయపడుతుంది. మీకు దీర్ఘకాలికంగా నోరు పొడిబారినట్లయితే, ఈ సమస్యకు గల ఇతర కారణాలు మరియు చికిత్సా ప్రత్యామ్నాయాల గురించి మీ వైద్యుడిని అడగండి.

**మీ దంతాలను గ్రైండ్ చేయడం:**

బ్రూక్సిజం అనే పరిస్థితి ఉంది, దీనిలో మీరు నిద్రపోతున్నప్పుడు లేదా పగటిపూట కూడా పళ్ళు గ్రైండ్ చేయడం జరుగుతుంది, ఇది తరచుగా తలనొప్పి మరియు దవడ నొప్పికి దారితీస్తుంది. తరచుగా, ప్రజలు తమ దంతాలను గ్రైండ్ చేస్తున్నారనే విషయం కూడా తెలియదు, ముఖ్యంగా రాత్రి సమయంలో. మీరు బ్రక్సిజంను అనుమానించినట్లయితే, మౌత్ గార్డ్‌తో సహా సాధ్యమయ్యే కారణాల కోసం మీ దంత వైద్యుడిని సంప్రదించండి.

**ధూమపానం:**

ధూమపానం ఆరోగ్యంపై దాని సాధారణ ప్రతికూల ప్రభావానికి ప్రసిద్ధి చెందింది, కానీ ఇది నోటి కుహరాన్ని కూడా గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ఇది చిగుళ్ల వ్యాధి, నోటిలో క్యాన్సర్ పెరుగుదల మరియు దంతాల మరకలు వంటి ఇతర విషయాల ప్రమాదాన్ని పెంచుతుంది. మీరు సిగరెట్ తాగడానికి బానిసలైతే. సాధారణ మరియు నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మానేయడం ఉత్తమం.

**మందులు మరియు నోటి ఆరోగ్యం:**

కొన్ని మందులు నోటి కుహరాన్ని ప్రభావితం చేసే దుష్ప్రభావాలను కలిగి ఉంటాయి. మీ మందులలో ఏదైనా నోటి ఆరోగ్య సమస్యకు దారితీస్తుందని మీరు అనుమానించినట్లయితే, దాని గురించి మీ వైద్యుడు లేదా దంతవైద్యునితో మాట్లాడండి.

**నోటి ఆరోగ్యానికి సమగ్ర విధానం:**

మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులు నోటి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి మరియు దీనికి విరుద్ధంగా నోటి ఆరోగ్యం ఒక వ్యక్తి యొక్క సాధారణ శ్రేయస్సుతో ముడిపడి ఉందని గ్రహించడం చాలా ముఖ్యం. సరైన ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం మరియు ఒత్తిడిని నిర్వహించడం వల్ల మొత్తం నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది.

**ఆరోగ్యకరమైన చిరునవ్వు కోసం క్విక్ చెక్‌లిస్ట్:**

శుభ్రత: పళ్ళతో పాటు నాలుకను కూడా శుభ్రం చేయడం మర్చిపోవద్దు.
ఎంపిక: ఎనామెల్‌ను రక్షించే ఫ్లోరైడ్ టూత్‌పేస్ట్‌ను వాడండి.
జాగ్రత్త: ఆహారంలో దాగి ఉన్న చక్కెరలు, సోడాల పట్ల అప్రమత్తంగా ఉండండి.
అలవాటు: బ్రష్ చేయడమే కాకుండా, దంతాల మధ్య ఇరుక్కున్న వ్యర్థాల కోసం ఫ్లాసింగ్ చేయండి.
పోషణ: దంతాల బలానికి కాల్షియం అధికంగా ఉండే ఆహారం మరియు నోటిని శుభ్రంగా ఉంచేలా నీరు ఎక్కువగా తీసుకోండి.
పర్యవేక్షణ: నోరు పొడిబారడం, పళ్ళు కొరకడం లేదా మందుల వల్ల కలిగే దుష్ప్రభావాలను గమనించి వైద్యుడిని సంప్రదించండి.
నివారణ: ధూమపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా చిగుళ్ల వ్యాధులు మరియు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.

ఆరోగ్యంగా కనిపించే నోటితో మోసపోకండి ఎందుకంటే మీకు తెలియకుండానే మీ దంతాలను ప్రభావితం చేసే అంతర్లీన నోటి ఆరోగ్య సమస్యలు ఉండవచ్చు. దంత సందర్శనలను షెడ్యూల్ చేయండి,


మీ సమస్యలను దంతవైద్యునితో చర్చించండి. నోటి ఆరోగ్యం కేవలం అందమైన చిరునవ్వు కోసమే కాదు, ఇది మీ గుండె మరియు శరీరంలోని ఇతర అవయవాల ఆరోగ్యంతో కూడా ముడిపడి ఉంటుంది. అందుకే క్రమం తప్పకుండా డెంటల్ చెకప్ చేయించుకోవడం ఉత్తమం.

దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా, దంత వైద్యుల సేవలను గుర్తించి కృతజ్ఞతలు తెలపడం మరియు ఆరోగ్యకరమైన దంతాల కోసం అవసరమైన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యకర జీవితాలను చిరునవ్వుతో అనుక్షణం ఆస్వాదిద్దాం.

**డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు,**
**మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం,**
**మేనేజింగ్ ట్రస్టీ, లయన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, విశాఖపట్నం.**

# పక్షవాతానికి కొత్త చికిత్స

ప్రపంచవ్యాప్తంగా వైకల్యం, మరణానికి దారితీస్తున్న ప్రధాన కారణాల్లో పక్షవాతం ఒకటి. దీన్నుంచి బతికి బయటపడ్డ వారిలో ఎంతోమంది సరిగ్గా కదల్లేక, ఇంటికే పరిమితమవుతున్నారు. ఇలాంటి దుస్థితిని తప్పించటానికి పరిశోధకులు చాలాకాలంగా ప్రయత్నిస్తున్నారు. మెదడు దెబ్బతినటాన్ని నివారించటానికి, పక్షవాతం అనంతరం నాడులు తిరిగి కోలుకోవటానికి తోడ్పడే కొత్త చికిత్సల కోసం అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో రక్తనాళం ద్వారా ఇచ్చే (ఐవీ) తాజా చికిత్స ఒకటి మేలి మలుపుగా కనిపిస్తోంది. ఇది మెదడు ఎక్కువగా దెబ్బతినకుండా చూడటంతో పాటు మరింత బాగా కోలుకునేలా చేస్తుండటం గమనార్హం. దీని ప్రాథమిక ఫలితాలు న్యూరోథెరప్యూటిక్స్ పత్రికలో ప్రచురితమయ్యాయి. పక్షవాతం వచ్చినప్పుడు దెబ్బతినే అవకాశం గల మెదడు కణజాలం చుట్టూ ఇది 'పొర'లా ఏర్పడటం ద్వారా నాడులు చనిపోకుండా కాపాడుతున్నట్టు, వాపు ప్రక్రియను తగ్గిస్తున్నట్టు పరిశోధకులు భావిస్తున్నారు. పక్షవాతం బారినపడ్డప్పుడు తొలి 6-12 గంటల్లో ఈ మందును రక్తనాళం ద్వారా ఇవ్వాల్సి ఉంటుంది. ఇది మెదడులోని భాగాలు దెబ్బతినటాన్ని తగ్గిస్తున్నట్టు కొందరిపై నిర్వహించిన ప్రయోగ పరీక్షల్లో తేలటం గమనార్హం. అలాగే మాటలు, కదలికలు త్వరగా తిరిగి వచ్చినట్టూ బయటపడింది. ఒక్క ప్రామాణిక చికిత్స మాత్రమే తీసుకున్నవారితో పోలిస్తే వీళ్లు రోజువారీ పనులు మరింత త్వరగా చేసుకునే విధంగా కోలుకున్నట్టూ వెల్లడైంది. చికిత్సను బాగా తట్టుకోవటం, తీవ్రమైన దుష్ప్రభావాలేవీ లేకపోవటం మరో మంచి విషయం.



## అనగనగా అనలాగ్ లైఫ్




పొద్దున లేవగానే పక్కనున్న ఫోన్ మోగడం.. కళ్లు తెరవకముందే నోటిఫికేషన్లు స్క్రోల్ చేయడం.. ఆఫీస్‌లో ల్యాప్‌టాప్, మధ్యమధ్యలో వాట్సాప్, రాత్రి పడుకునే ముందు.. ఏదోఒక వెబ్‌సిరీస్! చాలామంది జీవితం ఇప్పుడు కేవలం.. స్వైప్‌లు, ట్యాప్‌ల మధ్యే నలిగిపోతున్నది. ఈ డిజిటల్ ప్రపంచం ఇస్తున్న సౌకర్యం కంటే.. అది కలిగిస్తున్న అలసటే ఎక్కువగా భయపెడుతున్నది. అందుకే 2026లో ఒక కొత్త విప్లవం మొదలైంది. అదే 'అనలాగ్ లివింగ్'! స్మార్ట్‌ఫోన్ పక్కన పెట్టి.. మన స్పర్శకు స్పందించే, మన కంటికి నేరుగా కనిపించే నిజమైన అనుభూతుల వైపు జనరేషన్ జెడ్ పరుగులు తీస్తున్నది. అసలు ఇంతకీ ఈ 'అనలాగ్ లివింగ్' ఏంటి? అనలాగ్ విప్లవంలో భాగంగా ఇప్పుడు సోషల్ మీడియాలో 'అనలాగ్ బ్యాగ్స్' తెగ ట్రెండ్ అవుతున్నాయి. వినడానికి వింతగా ఉన్నా, ఇవి ఇప్పుడు ఒక స్టేటస్ సింబల్. ఈ బ్యాగుల ముఖ్య ఉద్దేశం ఏంటంటే.. మీ స్మార్ట్ ఫోన్‌ని చేతికి అందనంత దూరంలో ఉంచడం. మరి ఫోన్ లేకపోతే బోర్ కొట్టదా!? అంటే.. అక్కడే ఉంది అసలు మ్యాజిక్. ఈ బ్యాగులో పెయింటింగ్ కిట్స్, నవలలు, చిన్నపాటి పజిల్స్, డైరీలు, అల్లికల సామాగ్రి ఉంటాయి. ఎక్కడైనా వెయిట్ చేయాల్సి వచ్చినప్పుడు ఫోన్ తీసి 'డూమ్ స్క్రోలింగ్' చేయకుండా.. వీటితో కాలక్షేపం చేస్తారన్నమాట. ఇది మన మెదడుకి ఒక రకమైన ప్రశాంతతను ఇస్తుంది.

**కాన్సెప్ట్ : ఫోన్‌ని లోపల పెట్టి, చేతికి అందుబాటులో** నవలలు, జెంగా గేమ్స్, లెగో సెట్స్ లేదా డైరీలను ఉంచుకోవడం.

**లాభం :** వెయిటింగ్ రూమ్స్ లేదా ప్రయాణాల్లో ఉన్నప్పుడు బోర్ కొడితే ఫోన్ తీయకుండా, వీటితో క్వాలిటీ టైమ్ గడపవచ్చు.

**మెదడుకి ఎంత మేలు?**

స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ ఇచ్చే వెలుగు కంటే, మిత్రులతో కలిసి ఆడే లూడో బోర్డు ఇచ్చే ఆనందం చాలా గొప్పది. అందుకే 10 నిమిషాల్లో డెలివరీ వచ్చే క్విక్ కామర్స్ యాప్స్ మనల్ని బద్ధకస్తులుగా మార్చేస్తున్నాయని భావిస్తూ.. చాలామంది ఇప్పుడు స్వచ్ఛందంగా లోకల్ మార్కెట్ల వైపు అడుగులు వేస్తున్నారు. కూరగాయల కోసం, చిన్నచిన్న వస్తువుల కోసం నేరుగా కిరాణా కొట్టుకు వెళ్లడం వల్ల మన చుట్టూ ఉన్న ప్రపంచం కనిపిస్తుంది, నలుగురితో మాట్లాడతాం. ఇవే మనల్ని ఒత్తిడి నుంచి కాపాడతాయి.

నిరంతరం నోటిఫికేషన్లు, డేటా వెల్లువలో మన నాడీవ్యవస్థ ఎప్పుడూ అలర్ట్‌గా ఉండి అలిసిపోతున్నది. వస్తువులను ఫిజికల్‌గా తాకడం.. అంటే, పుస్తకం పేజీలు తిప్పడం, పెన్‌తో పేపర్ మీద రాయడం వల్ల మన మెదడు 'ప్రెజెంట్ మూమెంట్'లో ఉంటుంది. ఇది యాంగ్జయిటీని తగ్గించడమే కాకుండా, డిజిటల్ మీడియా దెబ్బతీసిన మన ఏకాగ్రతను మళ్లీ పునరుద్ధరిస్తుంది.

ప్రెజెంట్ మూమెంట్ : పేపర్ మీద పెన్నుతో రాయడం, ఒక పుస్తకం పేజీలు తిప్పడం వల్ల మెదడు ప్రస్తుతం జరుగుతున్న పనిపై ఎక్కువ ఫోకస్ చేస్తుంది.

**స్ట్రెస్ రిలీఫ్ :** నోటిఫికేషన్ల వెల్లువ తగ్గడం వల్ల నాడీవ్యవస్థ ప్రశాంతంగా ఉంటుంది. ఇది యాంగ్జయిటీని తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

**ఎలా మొదలుపెట్టాలి?**

అనలాగ్ లివింగ్‌లోకి మారడం అనేది ఒకేరోజులో జరిగిపోయే పనికాదు. దీనికోసం నిపుణులు కొన్ని సింపుల్ టిప్స్ సూచిస్తున్నారు. రాత్రి పడుకోవడానికి గంట ముందే ఫోన్ ఆపేసే 'డిజిటల్ సన్‌సెట్' పాటించడం. ఫోన్‌లో క్యాలెండర్ బదులు ఒక పేపర్ డైరీలో పనులు రాసుకోవడం, ఎప్పుడూ యూపీఐ పేమెంట్స్ కాకుండా అప్పుడప్పుడూ నగదు వాడటం వంటివి.. మనల్ని మళ్లీ రియల్ వరల్డ్‌కి కనెక్ట్ చేస్తాయి. అల్లికలు, వంట చేయడం, పెయింటింగ్ వంటి కొత్త హాబీలను నేర్చుకోవడం వల్ల.. మనకు మనమే ఒక క్వాలిటీ టైమ్ ఇచ్చుకోగలుగుతాం.

**డిజిటల్ సన్‌సెట్ :** నిద్రపోవడానికి ఒక గంట ముందే అన్ని స్క్రీన్లను ఆఫ్ చేయండి.

**వినైల్/సీడీ మ్యూజిక్ :** పాటలను స్కిప్ చేయకుండా వినడం అలవాటు చేసుకోండి.

**పేపర్ ప్లానర్ :** మీ రోజువారీ పనులను డైరీలో రాసుకోండి.

**ఆఫ్‌లైన్ కమ్యూనిటీస్ :** బోర్డ్ గేమ్‌క్లబ్స్, బుక్ రీడింగ్ సెషన్స్‌లో నేరుగా పాల్గొనండి. చివరగా, 'అనలాగ్ లివింగ్' అంటే టెక్నాలజీని వదిలేయడం కాదు.. అది మనల్ని పాలించకుండా చూసుకోవడమే! అందుకే, సాంకేతికతతో స్మార్ట్‌గా ఉంటూనే.. 'అనలాగ్'తో హెల్తీగా జీవించండి!

## హల్దీదూద్ ఎప్పుడు తాగాలి?




ఆరోగ్యానికి పసుపు పాలు ఎంతో మేలు చేస్తాయని చెబుతున్నారు నిపుణులు. పాలు, పసుపు, నల్ల మిరియాలు, అల్లం, దాల్చిన చెకతో తయారు చేసిన హల్దీ దూద్ ఏ కాలానికైనా అనువైన పానీయమే! ఇందులో ఆరోగ్యానికి సాయపడే యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి మైక్రోబయల్ లక్షణాలు ఉండటంతో మన శరీరానికి కావాల్సిన వెచ్చదనం లభిస్తుంది. ఆరోగ్యానికి పసుపు పాలు ఎంతో మేలు చేస్తాయని చెబుతున్నారు నిపుణులు. పాలు, పసుపు, నల్ల మిరియాలు, అల్లం, దాల్చిన చెకతో తయారు చేసిన హల్దీ దూద్ ఏ కాలానికైనా అనువైన పానీయమే! ఇందులో ఆరోగ్యానికి సాయపడే యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి మైక్రోబయల్ లక్షణాలు ఉండటంతో మన శరీరానికి కావాల్సిన వెచ్చదనం లభిస్తుంది. సాధారణ జలుబు, ఫ్లూతో బాధపడేవారికి కీళ్ల నొప్పులు, కండరాల సమస్యతో ఇబ్బందిపడే వృద్ధులకు హల్దీ దూద్ ఉపశమనం కలిగిస్తుంది. అయితే చాలామంది నిద్రపోయే ముందు పసుపు పాలు తాగుతుంటారు. అలా చేయడం ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే అధిక కేలరీలు ఉండే హల్దీ దూద్ తాగి పడుకుంటే జీర్ణవ్యవస్థకు అంతరాయం ఏర్పడుతుందట. పాలు తాగిన వెంటనే పడుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలూ తలెత్తుతాయి.

రాత్రి భోజనం కడుపు నిండుగా తిన్నతర్వాత పాలు తాగడం వల్ల ఉబ్బరం పెరుగుతుంది. వీలైతే రాత్రి భోజనానికి ముందు పాలు తాగడం మంచిది. దీనివల్ల ఆహారాన్ని కూడా మితంగా తీసుకున్నవాళ్లమవుతాం. భోజనం తర్వాత వెంటనే పాలు తాగకుండా కనీసం ఒకటి రెండు గంటల తర్వాత వెచ్చని పసుపు పాలను తక్కువ మోతాదులో తీసుకోవాలి. ఇందులో చకెరను నివారించడం ఎంతో ముఖ్యం. అప్పుడే జీర్ణక్రియపై ఒత్తిడి తగ్గుతుంది.

## అదేపనిగా ఆన్‌లైన్ గేమ్సా..? జాగ్రత్త!

ఆన్‌లైన్ గేమ్స్ ఇటీవల బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. విశ్రాంతి పొందటానికో, ఒత్తిడిని తగ్గించుకోవటానికో చాలామంది వీటిని ఆశ్రయిస్తుంటారు. అయితే సుదీర్ఘంగా వీటిని ఆడితే మనసుతో పాటు శరీరం మీదా విపరీత ప్రభావం పడుతుంది. ఆట మీదే తదేకంగా దృష్టి నిలపటం, భావోద్వేగాల హెచ్చుతగ్గులు, మధ్యలో విరామం తీసుకోకపోవటం వల్ల తెలియకుండానే ఒత్తిడి పెరుగుతుంది. హానికరం కాని వినోదంలా కనిపించినప్పటికీ ఆన్‌లైన్ గేమ్స్ ముప్పుగా పరిణమిస్తున్నాయన్నమాట. వీటిల్లో లోతుగా మునిగిపోతే ఒంట్లో అడ్రినలిన్, కార్టిజాల్ వంటి ఒత్తిడి హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి గుండె వేగం, రక్తపోటు పెరిగేలా చేస్తాయి. అదేపనిగా భావోద్వేగాలు ఎక్కువ, తక్కువ అవటం వల్ల అప్పటికే జబ్బులతో బాధపడుతున్నవారికి ముప్పుగా పరిణమిస్తుంది కూడా. ఉదాహరణకు–



అప్పటికే తీవ్ర మానసిక ఒత్తిడి, అధిక రక్తపోటు గలవారికి మెదడులో రక్తస్రావమయ్యే ప్రమాదముంది. ఆన్‌లైన్ గేమ్స్ ఆడటానికి గంటల కొద్దీ కదలకుండా కూర్చోవటం, శారీరక శ్రమ లేకపోవటం, వేళకు నిద్ర పోకపోవటం వంటివి రక్తపోటు మరింత పెరిగేలా చేస్తాయి. భావోద్వేగాలు అతిగా ప్రేరేపితం కావటంతో మానసిక ఒత్తిడీ ఎక్కువవుతుంది. కాబట్టి అతి ఎప్పుడూ పనికిరాదు. విశ్రాంతి కోసం ఎప్పుడో అప్పుడు, ఏదో కొద్దిసేపంటే ఏమో గానీ సుదీర్ఘంగా ఆడితే చేజేతులా సమస్యలు కొని తెచ్చుకున్నట్టే!

## ఏఐతో ముందస్తు గుర్తింపు



రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడంలో కృత్రిమ మేధ అద్భుతంగా పనిచేస్తున్నది. రేడియాలజిస్టులపై పనిభారాన్ని తగ్గించడంతోపాటు ఫలితాలను మెరుగుపరచడంలోనూ సాయపడుతున్నది. స్వీడన్‌లోని లండ్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించిన తాజా అధ్యయనం.. ఈ విషయాలను వెల్లడించింది. ఇందుకు సంబంధించిన వివరాలను 'ది లాన్సెట్' ప్రచురించింది. పరిశోధనలో భాగంగా, స్వీడన్‌కు చెందిన లక్ష మంది మహిళలకు రొటీన్ మామోగ్రఫీ స్క్రీనింగ్ నిర్వహించారు. సాధారణ పద్ధతి కంటే ఏఐ వాడకం వల్ల రొమ్ము క్యాన్సర్ గుర్తింపు 29 శాతం పెరిగినట్లు ఈ సందర్భంగా గుర్తించారు. ఇంటర్వెల్ క్యాన్సర్లు (రెండు స్క్రీనింగ్‌ల మధ్య బయటపడే ప్రమాదకర క్యాన్సర్లు) 12 శాతం తగ్గినట్లు వెల్లడించారు. ముఖ్యంగా వ్యాప్తిచెందే అవకాశం ఉన్న కొన్నిరకాల క్యాన్సర్లను ప్రారంభదశలోనే గుర్తించడంలో కృత్రిమ మేధ మెరుగైన ఫలితాలను ఇచ్చినట్లు పరిశోధకులు చెబుతున్నారు. అంతేకాకుండా.. రేడియాలజిస్టుల పనిభారాన్ని తగ్గించడంలోనూ కృత్రిమమేధ సాయపడుతున్నదని అంటున్నారు. సాధారణంగా మామోగ్రఫీ స్క్రీనింగ్‌ను ఇద్దరు రేడియాలజిస్టులు విశ్లేషించాల్సి ఉంటుంది. అయితే ఏఐని ఉపయోగించడం ద్వారా రేడియాలజిస్టుల పనిభారం 44 శాతం వరకూ తగ్గిందట. తక్కువ రిస్క్ ఉన్న కేసులను నేరుగా ఒక రేడియాలజిస్టుకు, అనుమానాస్పదంగా ఉన్న కేసులను ఇద్దరు నిపుణులకు పంపడం ద్వారా సమయం ఆదా అయ్యింది. ఏఐలోని సాంకేతికత మామోగ్రామ్ చిత్రాలను కొన్ని సెకన్లలోనే స్కాన్ చేస్తుంది. అసాధారణంగా, గడ్డలు ఉన్న ప్రాంతాలను హైలైట్ చేస్తుంది. ఇది మానవ కళ్లు గుర్తించలేని అతి సూక్ష్మమైన మార్పులను కూడా పసిగడుతుంది. దాంతో, వ్యాధిని ముందస్తుగా గుర్తించి.. మరింత వేగంగా, సమర్థంగా చికిత్స అందించే అవకాశం ఉంటుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## డిజిటల్ అడిక్షన్ యమ డేంజర్..



నేటి సాంకేతిక యుగంలో 'డిజిటల్ అడిక్షన్' పెను ముప్పుగా మారింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు దాదాపు ప్రతి ఒక్కరూ స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోవడంతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. నలుగురితో కలువడం తగ్గిపోయి కుటుంబ, స్నేహ బంధాలు బలహీనమవుతున్నాయి. చిన్నారుల్లో 'డిజిటల్ అడిక్షన్' విపరీతంగా పెరగడంపై కేంద్ర ఆర్థిక సర్వే–2025–26 తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యసనం వల్ల విద్యార్థుల్లో అకడమిక్ పెర్ఫార్మెన్స్, ఉద్యోగుల్లో వర్క్ ప్రొడక్టివిటీ తగ్గుతున్నదని, యువతలో మానసిక ఆరోగ్యం తీవ్రంగాదెబ్బతింటున్నదని పేర్కొన్నది. ముఖ్యంగా 15–24 మధ్య వయస్కుల్లో సోషల్ మీడియా వినియోగం ఆందోళనకర స్థాయికి చేరినట్టు తెలిపింది. మన దేశయువతలో సోషల్ మీడియా స్క్రోలింగ్, గేమింగ్ డిజార్డర్లు పెరుగుతున్నట్టు స్పష్టం చేసింది. వీటి వల్ల నిద్రలేమి, కోపం, సామాజిక బంధాలకు దూరంగా ఉండాలనే భావన అధికమై డిప్రెషన్‌కు లోనవుతున్నట్టు వివరించింది. 'టెలీ మానస్'కు ఏడాది కాలంలోనే 32 లక్షల ఫోన్‌కాల్స్ రావడంపై ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది.

నివారణకు చేపట్టాల్సిన చర్యలు

దేశంలో డిజిటల్ అడిక్షన్‌ను నిరోధించేందుకు ఇప్పటికే కొన్ని సంస్థలు చేపట్టిన కార్యక్రమాలను ఆర్థిక సర్వే ప్రస్తావించింది. పాఠశాలలు, స్కూలు బస్సుల్లో సురక్షిత ఇంటర్నెట్ వాడకానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ), స్క్రీన్ టైమ్ లిమిట్, ఆన్‌లైన్ సేఫ్టీపై నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ కొన్ని మార్గదర్శకాలు జారీచేసినట్టు వెల్లడించింది. డిజిటల్ అడిక్షన్‌ను తగ్గించేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆఫ్‌లైన్ యూత్ హబ్స్ ఏర్పాటు చేయాలని సర్వే సూచించింది. ఆయా ప్రదేశాల్లో ఆల్టర్నేట్ డిజిటల్ స్పేస్‌లు ఏర్పాటు చేయాలని తెలిపింది. పాఠశాలల్లో 'డిజిటల్ వెల్‌నెస్', సైబర్ సేఫ్టీ, మానసిక ఆరోగ్యంపై పాఠ్యాంశాలు బోధించాలని పేర్కొన్నది.

**మెదడుపై తీవ్ర ప్రభావం**

డిజిటల్ అడిక్షన్‌తో మెదడుపై తీవ్ర ప్రభావం పడుతుంది. విద్యార్థులు చదువులో వెనుకబడతారు. సామాజిక సంబంధాలు తగ్గుతాయి. దీన్ని నిరోధించాలంటే స్క్రీన్‌టైమ్‌ను నియంత్రించుకోవాలి. రోజుకు కనీసం 1–2 గంటలు ఫోన్ లేకుండా గడపడం అలవాటు చేసుకోవాలి. ఫోన్‌కు బదులు నడక, క్రీడలు, యోగా వంటివి చేయాలి. తద్వారా మెదడుకు విశ్రాంతి లభించి భావోద్వేగాల సమతుల్యత మెరుగుపడుతుంది. మెదడులో డోపమైన్, సెరటోనిన్ లాంటి సానుకూల రసాయనాలు పెరగడం ద్వారా డిప్రెషన్ తగ్గుతుంది. నిద్రకు ఉపక్రమించే ముందు మొబైల్ వాడకూడదు. కనీసం గంట ముందే ఫోన్ చూడటం ఆపేయాలి. లేకుంటే స్క్రీన్ల నుంచి వెలువడే నీలి కాంతి మెలటోనిన్ హార్మోన్ల ఉత్పత్తిని తగ్గించి నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. పిల్లలు చిరాకు పడటం, ఒంటరిగా ఫీల్ కావడం, చదువుపై ఆసక్తి తగ్గడం లాంటి లక్షణాలను డిజిటల్ అడిక్షన్‌కు సంకేతాలుగా భావించాలి. అవసరమైతే వైద్యనిపుణుల సహాయం తీసుకోవాలి.

## రాత్రి భోజనం పెందలాడే



సాయంత్రం కాగానే టీవీల ముందు కూలబడతారు. సీరియలో, సినిమానో చూస్తుంటారు. ఆఫీసు నుంచో, దుకాణం కట్టేసో వచ్చే కుటుంబ సభ్యుల కోసం ఎదురు చూపులు. అంతలో తొమ్మిదో, పదో అవుతుంది. అప్పుడు భోజనాలకు సిద్ధమవుతారు. ఇది చాలామంది ఇళ్లలో చూసేదే. ఇలా పొద్దుపోయాక తినటం కన్నా రాత్రి భోజన వేళలను కాస్త ముందుకు జరిపితే ఆరోగ్యానికి మేలు. అవును.. ఏం తింటున్నామనేదే కాదు, ఎప్పుడు తింటున్నామనేదీ కీలకమేనని నిపుణులు పేర్కొంటున్నారు. జీవక్రియ, జీర్ణక్రియ, కొవ్వు నిల్వలో జీవ గడియారం కీలక పాత్ర పోషిస్తున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. రాత్రి భోజనాన్ని పెందలాడే చేస్తే జీవ గడియారానికి అనుగుణంగా సవరించుకున్నట్టు అవుతుంది. పగటి వేళల్లో ఇన్సులిన్ బలంగా పనిచేస్తుంది. రాత్రి భోజనాన్ని పెందలాడే ముగిస్తే శరీరం ఇన్సులిన్‌కు స్పందించే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో తిన్న తర్వాత గ్లూకోజు మోతాదులు పెరగటం తగ్గుతుంది. అంతేకాదు, పెందలాడే భోంచేస్తే పరగడుపున గ్లూకోజు మోతాదులు తక్కువగా ఉంటున్నట్టు, ఇన్సులిన్ స్థాయులూ తగ్గుతున్నట్టు కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇవన్నీ ఆరోగ్యానికి మేలు చేసేవే. మధుమేహం, ముందస్తు మధుమేహం, అధిక బరువు, అధిక కొలెస్ట్రాల్ ముప్పులు తగ్గటానికి తోడ్పడేవే. పేగులూ ఆరోగ్యంగా ఉంటాయి. సాధారణంగా రాత్రివేళ జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. కాస్త ముందుగానే భుజిస్తే ఛాతీ మంట, కడుపుబ్బరం, అజీర్ణం వంటి సమస్యలకు దూరంగా ఉండొచ్చు. పెందలాడే భోజనం చేయటం వల్ల వాపు ప్రక్రియ సూచికల స్థాయులూ తగ్గుముఖం పడుతున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. ఇది క్యాన్సర్ల నివారణకూ ఉపయోగపడుతుంది.

## ఔషధ మొక్కల రహస్యాలను పసిగట్టే సరికొత్త విధానం..



ఆయుర్వేదం నుంచి అల్లోపతి వరకు.. అనేక రకాల మందుల తయారీలో వాడే చాలా ఔషధాలకు మూలం ప్రకృతిలో లభించే వృక్ష సంపదే. అయితే, ఒక మొక్కలో ఉండే వేల రకాల జీవక్రియల ఉత్పత్తులు మానవ శరీరంలోని కణాలపై ఎలా పనిచేస్తాయో కచ్చితంగా అంచనా వేయడం ఇప్పటి వరకు ఒక సవాలుగా ఉండేది. ఈ చిక్కుముడిని విప్పుతూ ఎమోరీ యూనివర్శిటీ పరిశోధకులు ఒక అద్భుతమైన పద్ధతిని కనుగొన్నారు.

ఏమిటీ 'మెటబాలిక్ స్నాప్‌షాట్'..?

సాధారణంగా ఒక మొక్కలోని సారాన్ని విశ్లేషించినప్పుడు, అందులో వందల కొద్దీ రసాయనాలు కనిపిస్తాయి. కానీ వాటిలో ఏది వ్యాధిని నయం చేస్తుంది? ఏది దుష్ప్రభావం చూపిస్తుంది..? అనేది తెలుసుకోవడానికి గతంలో భారీ ప్రయోగాలు అవసరమయ్యేవి.

శాస్త్రవేత్తలు కనుగొన్న తాజా పద్ధతి ప్రకారం.. ఒక మొక్క తాలూకు మొత్తం జీవక్రియల ప్రభావాన్ని ఒకే ఒక్క 'స్నాప్‌షాట్' చిత్రంలో చూసే వీలు కలుగుతుంది. దీని ద్వారా మొక్కలోని ఏ భాగం కణాల లోపలికి వెళ్లి వ్యాధిని అడ్డుకుంటుందో వేగంగా గుర్తించవచ్చు. సుదీర్ఘకాలం పట్టే క్లినికల్ ట్రయల్స్ అవసరం లేకుండానే, ప్రాథమిక స్థాయిలోనే మందు నాణ్యతను పరీక్షించవచ్చు.

ముందే తెలిసిపోతుంది...

శరీరంలోని ఆరోగ్యకరమైన కణాలకు ఆ మొక్కలోని రసాయనాలు హాని చేస్తున్నాయా..? లేదా..? అనేది ముందే తెలిసిపోతుంది. ఈ పరిశోధన సహజ సిద్ధమైన మందుల తయారీలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. మొక్కల నుంచి మరింత సురక్షితమైన, శక్తివంతమైన ఔషధాలను రూపొందించడానికి ఇది ఒక దిక్సూచిలా పనిచేస్తుందని ఎమోరీ యూనివర్శిటీ పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రస్తుతం క్యాన్సర్, మధుమేహం, వైరల్ ఇన్ఫెక్షన్లకు సంబంధించి ప్రకృతి సిద్ధమైన మందుల అన్వేషణలో ఈ టెక్నాలజీ కీలక పాత్ర పోషించనుంది. ముఖ్యంగా ప్రాచీన వైద్య విధానాల్లో వాడే మూలికల శాస్త్రీయతను నిరూపించడానికి ఈ 'స్నాప్‌షాట్' పద్ధతి ఎంతగానో ఉపయోగపడుతుందని వైద్యనిపుణులు భావిస్తున్నారు.

## చంచలత్వం తగ్గుతుంది..



బుద్ధ భగవానుడు ధర్మసూత్రాలను ప్రతిపాదించినప్పుడు.. వాటికి విశ్వజనీనతను ఆపాదించాడు. ధర్మాచరణ ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా ఒకేలా ఉంటుంది. ఎవరు పాటించినా ఒకే ఫలితాన్ని ఇస్తుంది. అంటే దేశకాలాదులను బట్టి బౌద్ధధర్మం మారదు. అందుకే బుద్ధుడు– సద్ధర్మ సాధనలో.. ఆది, మధ్య, అంత్యం.. ఎక్కడైనా, ఎప్పుడైనా మంచిదేనని తెలియజేశాడు. బుద్ధుని ప్రతి వాక్కులోనూ లోతైన అర్థం ఉంటుంది. ధర్మ సాధనకు తగిన ఫలితం కూడా అమోఘంగా ఉంటుంది. దీన్నే బుద్ధుడు పాళీ భాషలో 'సాత్త' అని చెప్పాడు. సాధకుడు మూడు దశల్లో చేయవలసిన క్రియలూ, వాటి ఫలితాలను ఆయన స్పష్టంగా తెలియజేశాడు.

బౌద్ధ ధర్మాన్ని అనుసరించే వారికి ముందు శీలం, నైతిక ప్రవర్తన, హింసకు పాల్పడకపోవడం, సత్యమే చెప్పడం, చౌర్యం చేయకపోవడం వంటి పంచశీలను బోధిస్తారు. వాటిని పాటించడం ద్వారా ఈ దశలో శీలం స్థిరపడుతుంది. సచ్ఛీలత గలవారు ఎప్పుడూ సన్మార్గాన్నే అనుసరిస్తారు. శీల సాధనతో ఆదిలోనే మనకు సర్వత్రా మంచి జరుగుతుంది. మధ్యలో ఎలా మంచిదంటే– ఏకాగ్రతను అలవర్చుకోవడం ద్వారా ఇక్కడ పురోగతి ఉంటుంది. ధ్యానంతో మనసు పరిణతి చెందుతుంది. లౌకిక చంచలత్వం తగ్గుతుంది. అల్పమైన కోరికల వెనుక మనసు పరుగులు తీయదు. సర్వత్రా సత్యమే గోచరిస్తుంది. ఫలితంగా ఇక్కడ స్థిరచిత్తం రూఢి అవుతుంది. అంత్య దశలో సాధకుడు ప్రజ్ఞావంతుడవుతాడు. రాగం, ద్వేషం పూర్తిగా అంతరిస్తాయి. ఇవి మళ్లీ సాధకుని అనుభవంలోకి రావు. ఇక్కడ దుఃఖం నుంచి విముక్తి కలుగుతుంది. అమలిన ఆనందం సిద్ధిస్తుంది. సాధకుడు ఒక్కో దశలో ఉత్తీర్ణత సాధిస్తూ ధార్మికుడవుతాడు. కాబట్టి సద్ధర్మ సాధన ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరికైనా మంచే చేస్తుంది.

## వాట్సప్‌లో గ్రూప్ మెసేజ్ హిస్టరీ

వాట్సప్ కొత్తగా గ్రూప్ మెసేజ్ హిస్టరీ ఫీచర్‌ను తీసుకొస్తోంది. కొత్త సభ్యులకు స్వాగతం పలకటానికిది ఎంతో అనువుగా ఉంటుంది. దీంతో అడ్మిన్లు, గ్రూప్ సభ్యులు కొత్తవారికి ఇటీవలి మెసేజ్‌లను షేర్ చేయొచ్చు. అప్పుడు నడుస్తున్న చర్చల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా పాల్గొనొచ్చు. అన్ని వాట్సప్ మెసేజ్‌ల మాదిరిగానే గ్రూప్ మెసేజ్ హిస్టరీ కూడా ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్ట్ అయ్యి ఉంటాయి. అందువల్ల కన్వర్జేషన్లు రహస్యంగానే ఉంటాయి. స్క్రీన్‌షాట్ల మీద ఆధారపడటం, మాన్యువల్‌గా మెసేజ్‌లను ఫార్వర్డ్ చేయటం వంటి ఇబ్బందులేవీ ఉండవు. గ్రూప్ మెసేజ్ హిస్టరీ ఫీచర్ సాయంతో అడ్మిన్లు, సభ్యులు 25 నుంచి 100 వరకూ ఇటీవలి మెసేజ్‌లను ఎంచుకొని, పంపటానికి వీలుంటుంది. వీటి ద్వారా కొత్త సభ్యులు సమంజసమైన సందర్భం తెలుసుకోవచ్చు. ఒకవేళ అడ్మిన్లు వద్దనుకుంటే ఈ ఫీచర్‌ను డిసేబుల్ చేసే అవకాశమూ ఉంటుంది. అయినా కూడా అడ్మిన్లు ఎప్పుడైనా తమంతతాము మెసేజ్ హిస్టరీని షేర్ చేయొచ్చు. మెసేజ్ హిస్టరీని షేర్ చేసినప్పుడు బృంద సభ్యులందరికీ దానికి సంబంధించిన నోటిఫికేషన్ అందుతుంది. ఇది పారదర్శకతకు తావిస్తుంది.

# గోదావరి జిల్లాల సమాచారమ్

## కోనసీమ, తూర్పుగోదావరికి రూ.47.44 కోట్లు



**రాజమహేంద్రవరం :** వచ్చే ఏడాది జూన్ 26 నుంచి ప్రారంభంకానున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలోని 39 ఆలయాల పునర్నిర్మాణం, ఆధునికీకరణ, వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.47.44 కోట్లు మంజూరు చేసింది. ఏడాది గడువులోగా వీటిని పూర్తి చేయాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తోంది. తూర్పులో 18, కోనసీమలో 21 ఆలయాల పనులు త్వరితగతిన ప్రారంభించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఆ శాఖ అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. తూర్పుగోదావరికి రూ.23.65 కోట్లు, కోనసీమకు 23.79 కోట్ల పనులు మంజూరు చేశారు. రాజమహేంద్రవరంలోని శ్రీరామాసత్యనారాయణ స్వామి ఆలయ ముఖమండపం పునర్నిర్మాణానికి రూ.కోటి, పీఎంకే సత్రం రెండంతస్తుల్లో పిండ ప్రధాన హాలు అభివృద్ధికి రూ.3 కోట్లు, గౌతమీ జీవకారుణ్య సంఘంలో భవనం, వంటశాల పునర్నిర్మాణానికి రూ.2.80 కోట్లు, ధవళేశ్వరంలోని లక్ష్మీ జనార్దన, ఆంజనేయస్వామి ఆలయాల అభివృద్ధికి రూ.కోటి మంజూరు చేశారు. గంటాలమ్మవారి వీధిలోని లక్ష్మీనారాయణ అన్నదాన సమాజం భవన పునర్నిర్మాణానికి రూ.70 లక్షలు, బాలాత్రిపుర సుందరి ఆలయ, కల్యాణ మండపం అభివృద్ధికి రూ.60 లక్షలు, రామలింగేశ్వర, చౌడేశ్వరస్వామి (లక్ష్మీవారపుపేట) ఆలయాల ముఖమండపం, ధ్వజస్తంభం పునర్నిర్మాణానికి రూ.55 లక్షలు కేటాయించారు. వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధి, సుందరీకరణకు రూ.30 లక్షలు, చందాసత్రంలో మొదటి అంతస్తులో మరమ్మతులు, మరుగుదొడ్ల పునర్నిర్మాణం, వంటగది, భోజనశాల, ఇతర గదుల్లో వసతుల కల్పనకు రూ.1.50 కోట్లు కేటాయించారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ఆలయ పునర్నిర్మాణానికి రూ.3 కోట్లు కేటాయించారు. పెరవలి మండలం అన్నదేవరపాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేశారు. గుబ్బాలమ్మ (నిడదవోలు), జనార్దనస్వామి (కపిలేశ్వరరపురం), లక్ష్మీనరసింహస్వామి (కోరుమిల్లి), రామలింగేశ్వరస్వామి (నిడదవోలు), సీతారామస్వామి (అన్నదేవరపేట, తాళ్లపూడి) ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు.

## ఏలేరు రిజర్వాయర్ పరిసరాల్లో పెద్దపులి



**గంగవరం, గోకవరం, జగ్గంపేట గ్రామీణం:** పోలవరం జిల్లా గంగవరం మండలం మొల్లేరు, ఆర్డీపురం, ఓడ్డిచెరువు గ్రామాల పరిసరాల్లో పెద్దపులి కదలికలు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఏలేరు రిజర్వాయర్ పులికొండ ప్రాంతంతో సంచరించినట్లు సబ్ డీఎఫ్‌వో సుబ్బారెడ్డి తెలిపారు. అటవీశాఖ అధికారులు ఆయాగ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అడ్డతీగల సబ్ డీఎఫ్‌వో సుబ్బారెడ్డి, రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పులి కదలికలను ప్రత్యేక బృందాలతో ట్రాక్ చేస్తున్నారు. గురువారం రాత్రి ఏలేరు రిజర్వాయర్ పరిసరాల్లో కదలికలను గుర్తించారు. సీసీపీఎఫ్ కంచునాథరెడ్డి ఆధ్వర్యంలో డీఎఫ్‌వోలు, రేంజి అధికారులు ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు ఏలేరు రిజర్వాయర్ పరిసరాల్లో పెద్దపులి కదలికలను పరిశీలించారు.

మన్యం సరిహద్దు గ్రామమైన గోకవరం మండలం మల్లవరం వైపు గురువారం ఉదయం పులి వచ్చిందన్న వదంతులతో రైతులు పొలాలకు వెళ్లలేదు. పశువులను అటవీప్రాంతం నుంచి ఇళ్ల వద్దకు తీసుకువచ్చారు. మల్లవరం, కలిజోళ్లతోపాటు సమీప గ్రామాల్లో దండోరా వేయించారు. ఆలయాల వద్ద మైక్‌సెట్ల ద్వారా జాగ్రత్తలు చెబుతూ ప్రజలను అప్రమత్తం చేశారు. ఏలేరు జలాశయం గట్టు బాట పడితే మల్లవరం దాటుకొని జగ్గంపేట మండలంలోకి పులి ప్రవేశించే అవకాశం ఉండడంతో గోవిందపురం, బావవరం ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అటవీ ప్రాంతం మధ్యలో ఉన్న భూపతిపాలెం పాఠశాల విద్యార్థులు రాత్రి సమయంలో బయటకు రాకుండా అధికారులు సూచనలు చేశారు.

**జాతీయస్థాయి నుంచి అనుమతులు..!**

పెద్దపులిని బంధించేందుకు అటవీశాఖ అధికారులు రిజర్వాయరు పరిధిలో మూడు బోన్లు సిద్ధం చేసినట్లు సమాచారం. పులిని మరోసారి పట్టుకోవాలంటే జాతీయ స్థాయి నుంచి ప్రత్యేక అనుమతులు రావాల్సి ఉంటుందని, అవికూడా వచ్చినట్లు తెలుస్తోంది. దీన్ని అధికారులు ధ్రువీకరించలేదు. పులిని బంధించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## మోసగించిన కేసులో పురోగతి లేక నష్టపోతున్నాం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట ఐశ్వర్య నగర్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న గుప్తా చిట్స్ అండ్ ఫైనాన్స్ సంస్థ తమతో డిపాజిట్లు చేయించుకుని మోసగించిందని, ఆ నేపథ్యంలో తమ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి నాలుగు నెలలు కావస్తున్నా కేసులో పురోగతి లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కేసులో నిందితులను అదుపులోకి తీసుకోలేదని పోలీసుల తీరును బాధితులు తప్పుబట్టారు. మండపేట పట్టణంలో గురువారం బాధితుడు గ్రంధి సూర్య వెంకట ప్రకాష్‌రావు విలేకరులకు తన గోడు చెప్పుకున్నారు. చిట్ అండ్ ఫైనాన్స్ సంస్థలో చేసిన డిపాజిట్లు కాలపరిమితి ముగిసిందని, త్వరలో మీ సొమ్ము తిరిగి ఇస్తామని తమ వద్ద నుంచి డిపాజిట్లు బాండ్లను సంస్థ నిర్వాహకులు వాకచర్ల గుప్తా బంధువు చెక్కా సత్యనారాయణ తీసుకెళ్లారన్నారు. తమ సొమ్ము తిరిగి ఇవ్వకపోవడంతో ఫిర్యాదు చేయగా మండపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. కేసు నమోదు చేసి నాలుగు నెలలు అయినప్పటికీ నిందితులను అదుపులోకి తీసుకోలేదన్నారు. 90 రోజుల్లో విచారణ జరిపి నివేదిక సమర్పించాలన్న హైకోర్టు ఉత్తర్వులను కూడా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనలాంటి బాధితులు సుమారు రూ.ఏడు కోట్లు నష్టపోయారని, ఆ సొమ్మును నిందితులు వేర్వేరు ప్రాంతాలకు తరలించారని ఆరోపించారు. కేసును త్వరితగతిన విచారించి బాధితులకు న్యాయం చేయాలని సూర్య వెంకట ప్రకాష్‌రావు పోలీసులను కోరారు.

## వివాహిత ఆత్మహత్య

**ధవళేశ్వరం:** స్థానిక బత్తిన సుబ్బారావు కాలనీకి చెందిన వివాహిత శీలంశెట్టి నాగవర్ష(30) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బత్తిన సుబ్బారావు కాలనీకి చెందిన శీలంశెట్టి శరత్, నాగవర్షకు 14 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం రాత్రి స్నానానికి వెళ్ళిన నాగవర్ష ఎంతకీ తిరిగి రాకపోవడంతో వెళ్ళి చూడగా సీలింగ్‌కు ఉరివేసుకొని ఉంది. ఉరి వేసుకొని ఉన్న నాగవర్షను భర్త, అటుగా వెళుతున్న మరొక వ్యక్తి కిందకు దించి స్థానిక డాక్టర్‌ను పిలవగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలు అన్నయ్య బైరిశెట్టి శివరామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధవళేశ్వరం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సీఐ టి.గణేష్ దర్యాప్తు చేస్తున్నారు.

## పట్టింపులేని అధికార యంత్రాంగంపై కలెక్టర్ ఆగ్రహం



**కాకినాడ:** వేట్లపాలెంలోని సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్‌లో ఇటీవల చోటు చేసుకున్న బాణసంచా పేలుళ్ల ఘటనలో మృతుల సంఖ్య 28కి చేరింది. ఈ ప్రమాదానికి గల కారణాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. బాణసంచా తయారీ సక్రమ పద్ధతిలో జరగడం లేదని గతంలోనే సహచర వర్తకులు అప్పటి జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి (డీఎఫ్‌వో)కి ఫిర్యాదు చేశారు. టపాసులు, బాంబులు కాల్చిన వ్యర్థాల నుంచి ప్లాస్టిక్ వస్తువులు సేకరించి వాటిని మళ్లీ బాణసంచా తయారీలో ఉపయోగిస్తున్నారని డీఎఫ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆ తయారీ సంస్థ యజమాని అడబాల అర్జున్‌ను పిలిపించి హెచ్చరించారు. మరోసారి ఇలాంటివి వినియోగించనని, వ్యాపారం కూడా మానేస్తానని అతను చెప్పడంతో చర్యలు తీసుకోలేదు. తయారీ కేంద్రం అనుమతి గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. ఆర్డర్లు ఎక్కువ రావడం, ఆఖరు నెల కావడంతో భారీగా బాణసంచా తయారుచేసి నిల్వ చేద్దామని అర్జున్ భావించినట్లు తెలిసింది. ప్లాస్టిక్ చిచ్చుబుడ్లలో మందుగుండును ఇనుప సుత్తులు, హైడ్రాలిక్ యంత్రాలను ఉపయోగించి గట్టిగా దట్టిస్తున్నప్పుడే భారీ విస్ఫోటం జరిగి అమాయకుల ప్రాణాలు బుగ్గయ్యాయి.

.కలెక్టర్ ప్రశ్నలకు నీళ్లు నమిలిన అధికారులు

ఈ ప్రమాదం జరిగిన రెండు రోజుల తర్వాత కలెక్టర్, ఎస్పీ సంబంధితశాఖలతో సమావేశమయ్యారు. బాణసంచా కేంద్రంపై సమగ్ర వివరాలు కలెక్టర్ అడిగినప్పుడు సరైన సమాధానం ఇవ్వలేక అగ్నిమాపక, కార్మికశాఖల అధికారులు మౌనం వహించారు. దీంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022లో సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్‌కు అనుమతులిచ్చారు. 2024లో రెన్యువల్ చేశారు. ఈ సమయాల్లో శాఖల వారీగా నిర్వహించిన నోట్ ఫైళ్లు చూపించాలని అడిగితే నీళ్లు నమిలారు.

ఆన్‌లైన్‌లోనే అనుమతులిచ్చేశారట

'అంతా ఆన్‌లైన్‌లోనే అనుమతులిచ్చేశాం.. క్షేత్ర స్థాయిలో పరిశీలించాల్సిన అవసరం లేదు' అంటూ కార్మికశాఖ అధికారులు ఓ జీవో చూపించడంపై ఉన్నతాధికారులు విస్తుపోయారు. బాణసంచా తయారీ, నిల్వ, రవాణాకు పెట్రోలియం, ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ నుంచి లైసెన్స్ పొంది ఉండాలి. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పెసో అధికారి ప్రమాదం జరిగిన తర్వాత వచ్చి ఫొటో తీసుకుని వెళ్లిపోయారు. ఆ తర్వాత ఫోన్ చేసినా అతని నుంచి సరైన స్పందన లేదు.

మరికొందరికి అదనపు పరిహారం..

మృతుల్లో కొంతమందికి తెదేపా, జనసేన క్రియాశీలక సభ్యత్వాలున్నాయి. పార్టీ పరంగా వారికి బీమా సాయం అందే అవకాశం ఉంది. మరికొందరికి బ్యాంకు ఖాతాలున్నాయి. కొందరు వ్యక్తిగతంగానూ బీమా చేసుకున్నారు. ఆ మేరకు పరిహారం అందే అవకాశం ఉంది.

బీమా పరిహారం అందరికీ సమానంగా..?

ఫైర్‌వర్క్స్ యజమాని అర్జున్, అతని సోదరుడు వీరబాబు, తండ్రి శ్రీనివాసరావుతో పాటు మరో అయిదుగురు కార్మికులకు కలిపి బీమా చేయించారు. ప్రమాదంలో యజమాని తండ్రి చనిపోయారు. వీరి పేరున రూ.1.40 కోట్ల బీమా పరిహారం ఉంది. యజమాని తండ్రికి రూ.40 లక్షలు మిగతా వారికి రూ.20 లక్షలు పరిహారం అందేలా ప్రీమియం కట్టారు. ఈ పరిహారం ఆరుగురికే కాకుండా చనిపోయినవారికి సమానంగా పంచాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే రూ.20 లక్షల చొప్పున బాధిత కుటుంబాలకు చెల్లించింది. ప్రమాదానికి కారణమైన యజమాని కుటుంబానికి కూడా చెక్కు ఇవ్వడానికి అధికారులు సిద్ధం చేశారు. కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో నిలిపేశారు.

## యథేచ్ఛగా సాగుతున్న అక్రమ రవాణా

**కాకినాడ :** జిల్లాలో పేదల బియ్యం, డీజిల్, పెట్రోలు, ఎరువులు, విత్తనాలు, ధాన్యం నిల్వల అక్రమ తరలింపు ఆగడం లేదు. కాకినాడ పోర్టు, పరిసర ప్రాంతాల్లో బియ్యం అక్రమ నిల్వలు, తరలింపుపై కూటమి ప్రభుత్వం వచ్చాక మెరుపుదాడులు నిర్వహించి, పెద్ద ఎత్తున సరకు స్వాధీనం చేసుకున్నారు. సిట్ ఏర్పాటు చేసి 13 కేసులు నమోదు చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని విడుదల చేసినా, ఈ కేసులు ఇంకా తేలలేదు. ఏడాది దాటినా పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇదే అదనుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.

పట్టుకున్న వాటిలో బియ్యమే ఎక్కువ..

జిల్లాలో 2024 జూన్ నుంచి 2026 జనవరి వరకు వివిధ ట్రేడుల కింద 6ఏ కేసులు 223 నమోదయ్యాయి. వీటి నుంచి రూ.50కోట్ల విలువైన సరకును స్వాధీనం చేసుకోవడం ఈ దందాకు నిదర్శనంగా నిలుస్తోంది. స్వాధీనం చేసుకున్న వాటిలో రూ.45 కోట్ల విలువైన బియ్యం ఉన్నాయి. ఇప్పటికి 202 కేసులను పరిష్కరించగా, ఇంకా 21 పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 13 కేసులు సిట్ నమోదు చేసినవే. జిల్లా సంయుక్త కలెక్టర్‌గా అపూర్వభరత్ డిసెంబరులో రాగా, ఆయన హయాంలో 135 కేసులను పరిష్కరించారు.

**ఆగని అక్రమార్కుల దందా..**

గతనెల 27న కాకినాడలో రూ.1.03లక్షల విలువైన 43 బస్తాల పేదల బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నలుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

ఈనెల 3న కరప మండలం, నడకుదురు వంతెన వద్ద రెండు ఆటోల్లో తరలిస్తున్న 39 బస్తాల పేదల బియ్యాన్ని పట్టుకున్నారు. దొరికింది



కొంతేనని, తరలిపోయిందని చాలా ఉందని కొందరు సిబ్బందే చెబుతున్నారు. దీనిపై డీఎస్‌వో సత్యనారాయణరాజు మాట్లాడుతూ అక్రమాల కట్టడికి గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్నిచోట్ల నిఘా పెట్టినట్లు చెప్పారు.

**సరకు స్వాధీనం ఇలా..**

పేదల బియ్యం 21,715 టన్నులు
ఆయిల్ 1,30,410 లీటర్లు
ధాన్యం 375 టన్నులు
పంచదార 4 టన్నులు
గ్యాస్ సిలిండర్లు 147
ఎరువులు 467 టన్నులు

## గందరగోళ వాతావరణంతో వాయిదా

**దొడ్డిగుంట (రంగంపేట):** ప్రతిష్ఠాత్మకంగా భావించిన దొడ్డిగుంటలోని మత్స్యకార సహకార సంఘం ఎన్నిక వాగ్వాదాలు.. నిరసనల మధ్య చివరికి వాయిదా పడింది. ఇరువర్గాల మధ్య వాదోపవాదాలతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కట్టుదిట్టమైన భద్రతా వలయంలో గురువారం ఎన్నిక నిర్వహించడానికి పటిష్ఠ ఏర్పాట్లుచేసినా వివాదాలు తప్పలేదు. కొవ్వూరు సబ్ డివిజన్‌లోని దాదాపు 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. దొడ్డిగుంట సంఘంలో దొడ్డిగుంట, వెంకటాపురం, సుభద్రంపేట, ముకుందవరం గ్రామాల్లోని 274 మంది ఓటర్లు ఉండగా ఉదయం 11 గంటల వరకు వచ్చినవారికి చీటీలు పంపిణీచేసి మధ్యాహ్నం 2 గంటలకు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు సూచించారు. దాదాపు 214 మందికి చీటీలు పంపిణీచేయగా ఒకరి చీటీతో మరొకరు రావడం, సమయం ముగిసిన తర్వాత మరికొందరు రావడం.. ఇలా గందరగోళ వాతావరణం నెలకొనడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. ఎన్నికల అధికారులను నిలదీయడంతో పాటు నిరసనలకు దిగారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అసలే ఎండ తీవ్రంగా ఉన్న తరుణంలో సమీప గ్రామాలకు వృద్ధులు వెళ్లి తిరిగిరాలేరని కొందరు వాదించారు. కూటమి నాయకులు, వైకాపా వర్గీయులు అధికారులతో తరచుగా వాదనలకు దిగారు. కూటమి నాయకులు ఆళ్ల గోవింద, ఎలుబండి సత్తిబాబు, ఆర్.నాగు, ఉద్దండ్రావు శ్రీనివాసరావు ఒకవైపు నిలవగా మరోవైపు జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైకాపా నాయకులు కొల్లాటి ఇజ్రాయెల్, అడబాల వెంకటేశ్వరరావు ఎన్నిక నిర్వహణ తీరుపై అధికారులను ప్రశ్నించారు. ఇరువర్గాల అభ్యంతరాలతో గందరగోళ వాతావరణం నెలకొని చివరకు వాయిదా



వేస్తున్నట్లు ఎన్నికల అధికారి కృష్ణవేణి ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి దొడ్డిగుంట చేరుకుని వైకాపా వర్గీయులతో చర్చించారు. తహసీల్దారు కె.అనసూయ ఎన్నిక నిర్వహణ తీరుని పరిశీలించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు స్థానిక పోలీసులు ఈ ప్రక్రియకు దూరంగా ఉన్నారు.

## మృతదేహం స్వాధీనం

**తాళ్లపూడి:** కొవ్వూరు పట్టణంలోని గోష్పాద క్షేత్రం పక్కన గల రజకులు దుస్తులు ఉతికే రేవులో గోదావరి నది ఒడ్డున మృతదేహాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ పి విశ్వం ఘటనా ప్రదేశంలో వివరాలను సేకరించారు. మృతదేహానికి సమీపంలో మోటార్ సైకిల్ ఉండగా దానిపై పి వెంకటేశ్వరరావు అని రాసి ఉందని చెప్పారు. అతని వివరాల కోసం ఇతర స్టేషన్లకు సమాచారం పంపామని తెలిపారు. మృతుడు పొకలి వెంకటేశ్వరావుగా అతనిది కృష్ణా జిల్లా కృతివేణు మండలం సీతనపల్లిగా తెలిసిందని తెలిపారు. అతని బంధువులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

## నిరాధార ఆరోపణలు తగవు

**కాకినాడ రూరల్:** వేలాది మంది డిపాజిటర్లతో ముడిపడి ఉన్న జయలక్ష్మి సొసైటీపై శాసనమండలిలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు నిరాధార ఆరోపణలు చేయడం తగదని చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు తెలియజేశారు. సర్పవరం జంక్షన్ వద్ద జయలక్ష్మి సొసైటీ మెయిన్ బ్రాంచ్ వద్ద గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జయలక్ష్మి ఎంఏఎం కో ఆపరేటివ్ సొసైటీ ప్రస్తుత పాలకవర్గం రూ.7కోట్లు దుర్వినియోగం చేసినట్టు తీవ్రమైన ఆరోపణలను ఎమ్మెల్సీ మండలిలో చేశారన్నారు. పెద్దల సభలో నిజాలు మాట్లాడాలని, జయలక్ష్మి సొసైటీపై చేసిన ఆరోపణలకు సంబంధించి సమాచారం మీరు ఎవరు వద్ద తీసుకున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారుల సమాచారం తీసుకున్నారా లేదా సొసైటీ ఆఫీసులో సమాచారం తీసుకున్నారా తెలియజేయాలన్నారు. ఇటువంటి ఆరోపణలు వలన మా మనోభావాలు దెబ్బతిన్నాయని, 20వేల మంది సభ్యులు, డిపాజిట్లరు మనో వేదనకు గురవుతున్నారన్నారు. మీకు తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జయలక్ష్మి సొసైటీ గత పాలకవర్గం బోర్డు తిప్పేయడంతో కేసులు సీఐడీ వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తమ పాలకవర్గం 67మంది సభ్యుల నుంచి వసూలు చేసిన రూ.7.60 కోట్లు ఉన్నాయని, వారి నుంచి మరో రూ.3కోట్లు వరకు రావల్సి ఉందన్నారు. రూ.7కోట్లు సీఐడీ కేసుల వలన సీజ్ చేసిన వాటిలో ఉన్నాయన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, గౌరవ ఎమ్మెల్సీ వీర్రాజుకు తాము వివరాలు అందజేస్తామన్నారు. జయలక్ష్మి కో ఆపరేటివ్ సొసైటీ మెంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం మా బాధలు గుర్తించి ట్రిబ్యునల్‌లో కేసులు పరిష్కారం చేసి ముందుగా సొమ్ము చెల్లించాలన్నారు. సొసైటీ పాలక వర్గ వైస్ చైర్మన్ పీవీ రమణమూర్తి, డైరెక్టర్లు గౌరీ శంకరరావు, సీహెచ్. సుబ్బారావు, శరణార్థి రవిశంకర్ పాల్గొన్నారు.

## పాలిసెట్‌కు నోటిఫికేషన్ విడుదల

- 'పది' విద్యార్థులకు చక్కని అవకాశం
- ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష

**రాయవరం:** సాంకేతిక విద్యాశాఖ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2026 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు పొందవచ్చు. పదో తరగతి పరీక్షలు ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందుగానే సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు పాలిసెట్ 2026 నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు, సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు. పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దరి చేర్చేలా కళాశాలలకు అనుబంధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరిశ్రమలతో కళాశాలలను అనుసంధానం చేయడం ద్వారా ఏటా కళాశాలల్లో క్యాంపస్ సెలెక్షన్స్ నిర్వహించారు. నైపుణ్యం ఉన్న విద్యార్థులకు ఉద్యోగాలు కూడా దక్కాయి. గత ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది.

**భావిజీవితానికి బాటలు**

పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం ద్వారా తక్కువ ఖర్చుతో ప్రాథమికంగా సాంకేతిక విద్య లభిస్తే దానిని పునాదిగా చేసుకుని భావి జీవితానికి బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది. గ్రామీణ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి ఉన్నత సాంకేతిక చదువులను అందుకోవాలంటే ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని. అటువంటి వారికి పాలిటెక్నిక్ కోర్సులు చక్కని వేదికలు. పాలిసెట్ ద్వారా పాలిటెక్నిక్ కోర్సోల్ల చేరి విలువైన సాంకేతిక విజ్ఞానాన్ని సొంతం చేసుకుని సత్వర ఉపాధి ఉద్యోగ అవకాశాలు పొందే వీలుంటుంది. పాలిసెట్–2026 కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఏప్రిల్ 4వ తేదీన దరఖాస్తుల స్వీకరణకు తుది గడువుగా ప్రకటించారు.

**పాలిసెట్ ఎంట్రెన్స్ ఇలా..**

120 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు పరీక్ష ఉంటుంది. పదో తరగతి సిలబస్ ఆధారంగా ఎంట్రెన్స్ పరీక్ష జరుగుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహిస్తారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఫీజు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.100, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400గా నిర్ణయించారు.

**విద్యార్థులకు ప్రయోజనాలెన్నో..**

పాలిటెక్నిక్‌లో ఏ కోర్సు పూర్తి చేసినా ఉద్యోగం, ఉపాధి సులభంగా దొరుకుతుంది. ఈ కళాశాలల్లో ఇటీవల తరచూ ఉద్యోగ మేళాలను నిర్వహిస్తున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు వచ్చి విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సు చేయడానికి మూడేళ్లకు కేవలం రూ.13 వేలు అవుతుంది. ఆ తర్వాత ఇంజినీరింగ్ సెకండియర్లో చేరవచ్చు. లేదా ఉద్యోగానికి ప్రయత్నించవచ్చు.

**లభించే కోర్సులివీ..**

పాలిటెక్నిక్ కోర్సులను ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్నాయి. ఆయా కళాశాలల్లో కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ తదితర కోర్సులు అందుబాటులో ఉంటాయి. పలుచోట్ల ఒక్కో కోర్సులో ఒక్కో బ్రాంచ్‌కు 60 నుంచి 120 వరకూ సీట్లు అందుబాటులో ఉంటాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉండగా, జిల్లా వ్యాప్తంగా మరో ఐదు ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. జిల్లాలో 1,560 వరకు వివిధ ట్రేడ్స్‌లో సీట్లు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, అనపర్తిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలుండగా, కాకినాడ జిల్లాలో కాకినాడలో రెండు, పిఠాపురంలో ఒకటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలో దాదాపుగా 17 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలుండగా, దాదాపుగా 4,500 సీట్లు ఉన్నట్లు సమాచారం. ఈ కోర్సు కాల వ్యవధి మూడేళ్లు. ఇందులో భాగంగా ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. విద్యార్థుల నైపుణ్యం పెంపొందించుకునే శిక్షణ సైతం ఇస్తారు. పాలిసెట్ ఎంట్రన్స్‌ల క్వాలిఫై మార్కులు 35 గా నిర్ణయించారు.

**కోచింగ్, మెటీరియల్ ఉచితం**

త్వరితగతిన ఉపాధి పొందేందుకు పాలిటెక్నిక్ చక్కని అవకాశం. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత కోచింగ్‌తో పాటు, సంబంధిత మెటీరియల్ కూడా ఉచితంగా సరఫరా చేస్తున్నాం.

**హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు**

పాలిటెక్నిక్ కోర్సులు చేసిన వారికి మంచి అవకాశాలున్నాయి. పాలిసెట్‌కు సంబంధించిన వివరాల కోసం కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశాం. అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రవేశాలు పొందేలా విస్తృతంగా ప్రచారం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం

## 'నన్నయ'లో ఖోఖో పోటీలు

**రాజానగరం:** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఖోఖో వుమెన్ ఇంటర్ కాలేజీయేట్ కం చాంపియన్ షిప్ అండ్ యూనివర్సిటీ టీమ్ సెలెక్షన్స్ గురువారం జరిగాయి. గోదావరి జిల్లాలోని అనుబంధ కాలేజీల నుంచి 16 జట్లు, 240 మంది క్రీడాకారుల మధ్య పోటీ రసవత్తరంగా జరిగింది. ఈ పోటీలో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా ద్వితీయ స్థానంలో గొల్లల మామిడాడలోని డీఆర్ రెడ్డి కళాశాల, తృతీయ స్థానంలో ఏలూరులోని సెయింట్ థెరిసా కళాశాల జట్లు నిలిచాయని రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి తెలిపారు. వీరి నుంచి యూనివర్సిటీ టీమ్‌ని ఎంపిక చేసి, కర్ణాటకలోని దేవాంగరే యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ పోటీలకు పంపిస్తామన్నారు. ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ పి.విజయనిర్మల, సెక్రటరీ డాక్టర్ ఎంవీవీఎంయూ ఫణీంద్ర, పరిశీలకులు డాక్టర్ ప్రమీలారాణి, సెలెక్షన్ కమిటీ సభ్యులు ధర్మేంద్ర, పట్టాభి పాల్గొన్నారు.

## కనిపించని విషం దాగి ఉన్నట్లే..

**తుని:** ఓ ప్రాంతంలో ద్విచక్రవాహనాలపై క్యాన్లలో పాలు తీసుకువచ్చి విడిగా విక్రయిస్తారు. అనేక మంది ఖాళీ తాగునీటి ప్లాస్టిక్ సీసాలు తెచ్చి పాలు తీసుకువెళ్తుంటారు. పాలు వినియోగించి ఇదే సీసా తెచ్చి మళ్లీ మర్నాడు ఇందులోనే పాలు తీసుకువెళ్తూ పదే పదే వినియోగిస్తున్నారు. ఇళ్లకు సరఫరా చేసే పాలు కూడా అనేక మంది ఖాళీ నీటి సీసాల్లోనే ఇస్తున్నారు. అన్నవరం ఆలయానికి వచ్చే భక్తులు ప్లాస్టిక్ నీళ్ల సీసా కొనుక్కొని ఖాళీ అయిన తర్వాత మళ్లీ అందులోనే నీటిని నింపుకుని పలుమార్లు వినియోగిస్తుంటారు. అనేక మంది ప్రయాణాల్లోనూ ఇలాగే చేస్తుంటారు. కారులో వెళుతూ నీళ్ల సీసాకొంటాం. కొంత నీరు తాగి పక్కన పడేస్తాం. మళ్లీ కొద్ది రోజుల తర్వాత మళ్లీ ప్రయాణం చేస్తూ అదే సీసాలో నీరు నింపి తాగుతాం. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు వినియోగించిన ప్లాస్టిక్ సీసాల్లో అనేక మంది నీటిని తీసుకువెళ్తున్నారు. ఇలా వాడేసిన (సింగిల్ యూజ్) ప్లాస్టిక్ నీటి సీసాలను పదే పదే ఉపయోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశముంది. ఒకసారి వాడే ప్లాస్టిక్ సీసాలు పలుచని ప్లాస్టిక్‌తో తయారవుతాయి. వాటిని పదేపదే వాడటం వల్ల బ్యాక్టీరియా, సూక్ష్మ, అతి సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు ఇందులో ఉండే అవకాశముంది. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండే ప్రదేశంలో ఉంటే హానికర రసాయనాలు చేరే పరిస్థితులు ఉన్నాయి. ఒకసారి వాడే సీసాలను మళ్లీమళ్లీ ఉపయోగించకూడదు. వాంతులు, విరోచనాలు, ఇతర ఆరోగ్య సమస్యలకు ఆస్కారం ఉంది. బయట కొనుగోలు చేసిన నీళ్ల సీసాను తెరిచిన తర్వాత రెండు, మూడ్రోజులు ఆ నీటినే నిల్వ ఉంచి వినియోగించకూడదు. రాగి, స్టీల్ లేదా గాజు సీసాలు వాడటం మంచిది. ఇళ్లలో వాడే నీళ్లసీసాలు కూడా ఎక్కువ కాలం వాడకూడదు. కొద్ది రోజులు ఉపయోగించినా బాగా శుభ్రం చేసుకోవాలి.

## దూరవిద్య ఇంటర్ పరీక్షల్లో బహిరంగ అవకతవకలు

**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్ :** జిల్లాలో జరుగుతున్న దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్షల్లో బహిరంగంగా అవకతవకలు జరుగుతున్నాయని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా పిఠాపురం, కిర్లంపూడి మండలాల్లో ఏర్పాటు చేసిన కొన్ని పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులు యథేచ్ఛగా చూసి రాస్తున్నట్లు సమాచారం. పరీక్షా కేంద్రాల నిర్వాహకులే దీనికి సహకరిస్తూ వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల నుంచి చూసి రాయడానికి ఒక రేటు, అసలు అభ్యర్థి స్థానంలో వేరే వ్యక్తిని కూర్చోబెట్టి పరీక్ష రాయించేందుకు మరో రేటు పేరుతో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారం బహిరంగంగా సాగుతున్నప్పటికీ సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఇదే సమయంలో రెండు సంవత్సరాలుగా ఫీజులు చెల్లిస్తూ రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కష్టపడి చదివిన విద్యార్థి, డబ్బులు పెట్టి పరీక్ష రాయించిన వ్యక్తి ఒకే సర్టిఫికెట్ పొందే పరిస్థితి వస్తే చదువుపై నమ్మకం ఎలా నిలుస్తుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇలాంటి అక్రమాలకు అవకాశం కల్పిస్తే నిజంగా శ్రమించి చదివే విద్యార్థుల కష్టం వృథా కావడంతో పాటు వారి భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతుందని వారు మండిపడుతున్నారు. ఈ ఘటనలపై విద్యాసంఘాలు కూడా ఘాటుగా స్పందించాయి. వెంటనే విచారణ జరిపి సంబంధిత పరీక్షా కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. లేదంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలో జరుగుతున్న ఈ అవకతవకలను అరికట్టి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

## గన్నవరం ఎయిర్‌పోర్టును కమ్మేసిన పొగమంచు

**గన్నవరం విశాఖ సమాచారం :** గన్నవరం ఎయిర్‌పోర్టులో దట్టమైన పొగమంచు కమ్ముకుంది. గాల్లో పలు విమానాలు చక్కర్లు కొడుతున్నాయి. సేఫ్ ల్యాండింగ్‌కు క్లియరెన్స్ లేకపోవడంతో విమానాలు ల్యాండ్ అయ్యేందుకు అంతరాయం ఏర్పడింది. చెన్నై, హైదరాబాద్, సింగపూర్, ఢిల్లీ విమానాలు గాల్లో చక్కర్లు కొట్టాయి. ఈ కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఇండిగో విమానం ల్యాండింగ్‌కి వీలులేకపోవడంతో అధికారులు.. రాజమండ్రికి దారి మళ్లించారు. పొగమంచు ప్రభావం తగ్గే వరకు విమానాల రాకపోకల్లో అంతరాయం కొనసాగుతుందని ఎయిర్‌పోర్ట్ వర్గాలు తెలిపాయి. కొన్ని రోజులుగా గన్నవరం విమానాశ్రయంలో దట్టమైన పొగ మంచు



అలుముకోవడంతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నాలుగు రోజుల క్రితం పొగ మంచు కారణంగా ఇస్తాంబుల్ నుండి వచ్చిన ప్రత్యేక విమానం, ఢిల్లీ ఎయిర్ ఇండియా విమానం కాసేపు గాల్లో చక్కర్లు కొట్టాయి.

## ఎర్రంపాలెం ఎంపీపీ పాఠశాల వద్ద

### కట్టెల పొయ్యిపైనే వంట



**రంపచోడవరం విశాఖ సమాచారం :** ఎన్నో ఆశల నడుమ కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటైంది. ఇక అభివృద్ధి పరుగులు పెడుతుందని అందరూ భావించారు. కానీ ఇక్కడ వి ద్యార్థుల కష్టాలు తీర్చే నాథుడే లేకపోయారు. పాఠశాలలు, వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. జిల్లాలో 79 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 16,238 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక 15 వసతి గృహాల్లో 1,281 మంది విద్యను అభ్యసిస్తున్నారు. అయితే జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో కట్టెల పొయ్యిలపైనే విద్యార్థులకు భోజనాలను తయారు చేస్తున్నారు. పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు గ్యాస్ సిలిండర్లను ఉయోగించి వంటలు చేసుకుంటున్నా, ఇక్కడ మాత్రం ఇంకా కట్టెల పొయ్యిలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఏళ్ల కాలంగా ఈ పరిస్థితి ఉంది.

**కంట్లో పొగ.. ఇదో సెగ**

పాఠశాలల భవనాల పక్కనే కట్టెల పొయ్యిపై విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నారు. వంట సమయంలో వెలువడుతున్న పొగతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉన్నా ఉన్నతాధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు. పొగ కారణంగా చదువులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. వంట షెడ్లను నిర్మించకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. చాలా చోట్ల తరగతి గదులకు దగ్గరలోనే వంట చేయడంతో విద్యార్థులకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జిల్లాలోని ఐటీడీఏల పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు గ్యాస్ సరఫరా చేయడం లేదు. అన్ని చోట్లా కట్టెల పొయ్యిలపైనే వంట చేస్తున్నారు.

**ఇష్టారాజ్యం**

వంట కోసం గ్యాస్ అందించాలని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే నాలుగో తరగతి ఉద్యోగులు కోరుతున్నా, ఫలితం లేకుండా పోతోంది. కట్టెల పొయ్యి కారణంగా పొగచూరి ఆహార పదార్థాలకు పట్టడంతో ఒక్కోసారి తినడానికి ఇబ్బందిగా ఉంటుందని విద్యార్థులు వాపోతున్నారు. గతంలో ఆశ్రమ పాఠశాలలకు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేశారు. కొన్ని నెలలు తర్వాత ఎక్కడా అవి కనిపించలేదు.

కనీసం ఆయా ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో గ్యాస్ సిలిండర్లకు సంబంధించిన లెక్కలే లేవు. కాగా.. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు సంబంధించిన ఖాళీ గోనె సంచులు, విద్యార్థులు ఉపయోగించి, పాడైన ఐరన్ పెట్టెలు, పాత పుస్తకాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఫలసాయం డబ్బులను ట్రెజరీ ద్వారా గిరిజన సంక్షేమ శాఖ పద్దులో జమ అయ్యేటట్లు బ్యాంకు ద్వారా చెల్లించాలి. కానీ ఎక్కడా ఇదీ జరగడం లేదు. తమ ఇష్టారాజ్యంగా వార్డెన్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ప్రతిపాదనలు పంపించాం**

ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో గ్యాస్‌పైనే వంట చేసే విధంగా సిలిండర్ల సరఫరాకు ప్రతిపాదనలు పెట్టడం జరిగింది. గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్‌కు ఇక్కడి పరిస్థితిపై నివేదిక అందజేశాం. ప్రస్తుతం అన్ని చోట్లా గ్యాస్ సరఫరా చేసేందుకు అవకాశం ఉంది. జీసీసీ ద్వారానే గ్యాస్ సరఫరా చేసే అంశాలను ఆలోచన చేస్తున్నాం.

**ఉ రుక్మాంగదయ్య, డీడీ, రంపచోడవరం**

**ఇబ్బంది పడుతున్నాం**

ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు నెలకు ఒక్క సిలిండర్ మాత్రమే ఇస్తున్నారు. దీంతో రెండు వారాలకే అది ఖాళీ అవుతోంది. ఆ తర్వాత కట్టెల పొయ్యిపైనే వంట చేయాలి. కట్టెల పొయ్యిపై వంట చేయడం వలన పొగ వచ్చి ఇబ్బంది పడుతున్నాం. నెలకు సరిపడా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తే బాగుంటుంది. ఉ లక్ష్మి, వంటమనిషి, ఎంపీపీ స్కూల్, ఎర్రంపాలెం

**పొగతో ఆరోగ్యానికి ముప్పు**

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు కట్టెల పొయ్యిపై వంట చేసి భోజనం పెడుతున్నాం. దీని వల్ల పొగతో చాలా ఇబ్బంది పడుతున్నాం. కళ్లు పాడైన వారు, ఊపిరితిత్తులు పాడైన వారు కూడా ఉన్నారు. కట్టెల పొయ్యిపై వంట చేసే బాధను తప్పించాలి. ఉ జమయమ్మ, ఆశ్రమ పాఠశాల, గంగవరం

## గ్రామ సర్వేయర్ల సర్వీస్ నిబంధనలపై నిరసన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** ఈస్ట్ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న గ్రామ సర్వేయర్లు తమ Service Matters కు సంబంధించిన ముఖ్యమైన సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా Promotion Channel Fiing మరియు Basic Pay Fiing అంశాలపై ప్రభుత్వం త్వరితగతిన స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గ్రామ స్థాయిలో భూ సర్వేలు నిర్వహించడం, భూ రికార్డులను నిర్వహించడం, ప్రజలకు భూసంబంధిత సేవలు అందించడం వంటి కీలక బాధ్యతలను గ్రామ సర్వేయర్లు నిర్వర్తిస్తున్నప్పటికీ, ఇప్పటివరకు వారికి సరైన ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బేసిక్ పే ఫిక్సేషన్ విషయంలో కూడా స్పష్టత లేకపోవడంతో వారి ఉద్యోగ భద్రత మరియు భవిష్యత్తు పురోగతి విషయంలో అనిశ్చితి నెలకొంది.

అందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ సర్వేయర్లకు స్పష్టమైన ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేయాలని, బేసిక్ పేను న్యాయంగా ఫిక్స్ చేసి అమలు చేయాలని, వారి సర్వీస్ మ్యాటర్స్‌ను త్వరితగతిన పరిష్కరించాలని ఈస్ట్ గోదావరి జిల్లా గ్రామ సర్వేయర్లు నిరసన ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. వారి మాటల్లో "మేము మా విధులను నిబద్ధతతో నిర్వర్తిస్తున్నారొ కానీ మా హక్కులు మాత్రం అందడం లేదు. వెంటనే ప్రమోషన్ ఛానల్ మరియు బేసిక్ పే ఫిక్సేషన్ అమలు చేయాలి."

## అతిథి అధ్యాపకుల వంటా - వార్పు కార్యక్రమము



**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** అతిథి అధ్యాపకుల నిరసన దీక్షలను ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురుగా ఈరోజుకు 20వ రోజు చేరుకున్నది. ఈరోజు వంటా వార్పు కార్యక్రమాన్ని నిరసన దీక్ష శిబిరం వద్ద నిర్వహించారు. ముఖ్యంగా ఆంధ్ర యూనివర్సిటీలో పని చేసినటువంటి అతిథి అధ్యాపకులకు నెలవారి జీతాలు ఇవ్వాలని అనేక పర్యాయాలు ఆంధ్ర యూనివర్సిటీ అధికారులను మరియు రాష్ట్ర ఉన్నత విద్య శాఖా మాత్యులను కోరటం జరిగింది . ప్రక్కన ఉన్న గీతం యూనివర్సిటీలో అధ్యాపకులకు 80000 జీతం ఇస్తుండగా , ఆంధ్ర యూనివర్సిటీలో అతిథి అధ్యాపకులకు 6 నెలలకు 45000 మాత్రమే ఇస్తున్నారని అతిథి అధ్యాపకులు తెలిపారు.. ఇదిలా ఉండగా సాయంత్రం 4 గంటలకు రిజిస్ట్రార్, రెక్టార్ లు చర్చలకు అతిథి అధ్యాపకులను పిలిచారు. నెలవారీ జీతాల గురించి అడగ్గా, హయ్యర్ ఎడ్యుకేషన్ కు సమాచారం పంపించామని తెలియజేశారు. స్పష్టమైన హామీ అయితే వారి నుంచి రాలేదని అతిథి అధ్యాపకుల తెలిపారు. మా సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరసన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు డాక్టర్ ఎం సురేష్ మీనన్, డాక్టర్ ప్రసాద్, త్రినాధ్, కిరణ్, హేమ, దివ్య, లక్ష్మీ, కళ్యాణి, శిరీష్, వీరేందర్, అంబేద్కర్, విక్రమ్, పీవీ రామ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనముగా 2026 అనకాపల్లి బాలోత్సవ్ ప్రథమ పిల్లల పండుగ వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** 1200 మంది విద్యార్థిని,విద్యార్థులకు నిర్వహించిన వివిధ సాంస్కృతిక పోటీలు. అనకాపల్లి బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా అనకాపల్లి న్యూ కొలనీ రోటరీ హాలులో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన అనకాపల్లి బాలోత్సవ్ మొదటి రోజు వేడుకలో 1200 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనగా వారికి వివిధ రకాల సాంస్కృతిక, సాంఘిక, సామాజిక పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమములో ముందుగా బాలోత్సవ్ కమిటీ గౌరవాధ్యక్షులు శ్రీ బి.ఎస్.గుప్తా గారు



రిబ్బను కత్తిరించి పోటీలను ప్రారంభించారు. అనంతరం జిల్లాలో చదువుతున్న 1 నుండి 10 వ తరగతి విద్యార్థు

లు సుమారు 1200 మంది విద్యార్థిని, విద్యార్థులు వివిధ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను, ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యముగా శ్రీ రామా బాలా నంద సంఘం , రోటరీ క్లబ్ , భవ్యశ్రీ సంస్థల వారు తమ పూర్తి సహాయ సహకారాలను అందించారని అన్నారు. అలాగే ఈ బాలోత్సవ్ కమిటీ ప్రతీ ఏటా కూడా ఈ బాలోత్సవము వేడుకలను నిర్వహిస్తామని బాలోత్సవ్ కమిటీ అధ్యక్షులు శ్రీ కె.వి.ప్రకాష్ గారు తెలియజేసారు. కమిటీ కన్వీనర్ శ్రీ కడిమిశెట్టి త్రిమూర్తులు రెడ్డి గారు మాట్లాడుతూ విద్యార్థులలో మంచి క్రమ శిక్షణ నైతిక విలువలు, వారిలో ఉన్న సృజనాత్మకతలను వెలికి తీయాలన్న సదుద్దేశ్యముతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడము జరిగిందని అన్నారు. కమిటీ కార్యదర్శి శ్రీ బొప్పే ఉమామహేశ్వరరావు గారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాలకు సహకరించిన అందరికీ తమ కృతజ్ఞతలు తెలియజేశారు. బాలోత్సవ్ కమిటీ ప్రచార కార్యదర్శి , బాలోత్సవ్ కమిటీ కన్వీనర్ శ్రీమతి కడిమిశెట్టి సుభాషిణి గార్ల సారధ్యములో ఎంతో ఉత్సాహముగా ఘనముగా మొదటిరోజు బాలోత్సవ్ ప్రథమ వేడుకలు విజయ వంతముగా జరుగగా పోటీలలో గెలుపొందిన విజేతలకు రేపు సాయంత్రం ముఖ్య అతిధుల చేతులమీదుగా బహుమతులను అందజేస్తారని కమిటీ ప్రచార కార్యదర్శి బల్లానాగభూషణము తెలియజేసారు. ఈ కార్యక్రమములో కమిటీ ప్రతినధులుశ్రీ కె.వి.గౌరీపతి,శ్రీ ఎమ్.ఎస్.వి,ఎస్.పి,వర్మ , శ్రీ ఎమ్.శంకరవర ప్రసాద్, శ్రీ జి.ఎల్,ఎన్.శాస్త్రి, శ్రీ కె.రామమోహనారావు, శ్రీ శిష్టల తమ్మిరాజు,శ్రీ ఐ.చక్రపాణి, శ్రీ ఎమ్.రమేష్, శ్రీ జె.సురేష్, శ్రీమతి తేజస్విని,శ్రీ జి.రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడు గవర్నర్ గా త్వరలో సోము వీర్రాజు నియామకం ?

**( చలాది పూర్ణచంద్ర రావు )**



**విజయవాడ (విశాఖ సమాచారం):** (అర్ ఎన్ ఐ ).వివిధ రాష్ట్రాల గవర్నర్లని మారుస్తు కేంద్రప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం రానున్న ఎన్నికలను దృష్టిలోపెట్టుకుని చేసిన మార్పులుగా రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు .అయితే తమిళనాడుకి మాత్రం ఎవరిని బదిలి అయిన రవి స్థానం లో నియమించకుండా కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ కి అదనపు భాద్యతలు అప్పగించటం తో త్వరలో తమిళనాడు గవర్నర్ కి ఏర్పడిన ఖాళీలో ఆంధ్రప్రదేశ్ కి చెందిన సీనియర్ బి జె పి నాయకులు,బిజేపి జాతీయ కార్యవర్గ సభ్యులు,పోరుగు రాష్ట్రంలోని వారితో ముఖ్యంగా తమిళనాడు లో పార్టీ అభిమానులతో పాటు షుమారు కోట్లకు పైగా తెలుగు ప్రజల మనస్సులను ఆకట్టుకుని పార్టీని రానున్న ఎన్నికల్లో విజయపథం వైపు నడిపించేందుకు పరోక్షంగా పార్టీకి ప్రజాభిమానం పెంచే నాయకుడుగా గుర్తెరిగిన అధిష్టానం సోము వీర్రాజుని నియమించే అవకాశాలున్నట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు. సోము వీర్రాజు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లో 15 అక్టోబర్ 1957 లో జన్మించారు .భారతీయ జనతా పార్టీ ఆర్భావం నుండి అయన ఆ పార్టీ కార్యకలాపాల్లో ఎంతో అంకిత భావంతో చిత్తశుద్ధిగా సేవలు అందిస్తున్నారు .1980 లో బి జె వై తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్సి గా ఎఱ యవ పి రాజకీయ ప్రస్థానం సాగించిన అయన అనంతరం 1993–94లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బి జెవైఎం అధ్యక్షుడుగాను ,అనంతరం రాష్ట్ర బిజె పి పార్టీ లో వివిధ పదవులలో వివిధ హోదాల్లో పనిచేసిన అయన 2009 లో తూర్పుగోదావరి జిల్లా కేంద్రం కాకినాడ నుండి బి జె పి లోక్ సభ అబ్యర్థిగా పోటీ చేశారు. 2013 నుండి 2018 వరకు బిజే పి జాతీయ కార్యవర్గ లో పనిచేసిన అయన 2020 –23 లో ఆంధ్రప్రదేశ్ బి జె పి 12 వ అధ్యక్షులు గా పనిచేసి రాష్ట్రము లో వైఎస్సార్ పార్టీ ఒంటెత్తు పోకడలను సమర్ధవంతంగా ఎదుర్కొని ,ఆలయాలను విద్వంసం చేసిన సంఘటనల్లో కూడా అయన ఆ పార్టీ చర్యలేకుండా ప్రేక్షక పాత్ర వహించడాన్ని వ్యతిరేకంగా తన గళం వినిపించారు .అలాగే అధ్యక్షులుగా కూడా తన పదవికాలంలో బి జె పి పార్టీ పటిష్టతకు పనిచేసారు . అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావటం బి జె పి పార్టీ అబ్యర్థిగా శాసనమండలికి సభ్యునిగా ఎంపికైన ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ గా వున్న ఆయన ప్రస్తుతం కేంద్ర కమిటీ లో జాతీయ సభ్యునిగా కూడా కొనసాగుతున్నారు తాజాగా జరిగిన శాసన సభ, శాసన మండలి సమావేశాల్లో తిరుమల శ్రీవారి లడ్డు కల్తీ విషయంలో మండలి ఫ్లోర్ లీడర్ గా అయన ఆ నాటి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విధానం హిందువుల మనోభావాలకు మరింత ఊతం ఇచ్చినట్లైంది. దీన్ని కూడా పరిగణించిన జాతీయ పార్టీ అధిష్టానం త్వరలో తమిళనాడులో ఎన్నికలు రానున్నందున ,ఆ రాష్ట్రంలో పెరియార్ సిద్ధాంతం పెనవేసుకుపోయిన సందర్భంలో దాన్ని సమర్ధవంతంగా తిప్పి కొట్టేలా అవసరమైన పరోక్ష చేయుత ఇచ్చేందుకు అర్ ఎస్ ఎస్ మూలాలుకూడా వున్న సోము వీర్రాజు సమర్ధత తెరమీదకు రావటంతో అదిష్టానం తమిళనాడు గవర్నర్ రవి ని పశ్చిమ బెంగాల్ కి బదిలీ చేసినా ఎవరిని నియమించకుండా కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథన్ అర్లేకర్ కి అదనపు భాధ్యతలు ఇచ్చి ఆ ఖాళీని అలాగే ఉంచింది .పార్టీ స్థాపించిన నాటినుండి నమ్మిన సిద్ధాంతం కోసం పాటుపడిన సోము వీర్రాజు సేవలను అధిష్టానం గుర్తించటం తో పాటు త్వరలో రానున్న తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో విజయ భేరి మోగించేందుకు గవర్నర్ గా సోము వీర్రాజు ని నియమించే అవకాశాలు కచ్చితంగా వున్నాయని అత్యంత విశ్వనీయ సమాచారం.

## శ్రీరాముని కళ్యాణ మహోత్సవం

### శిలావగ్రహాలకు పాలాభిషేకము జలాభిషేకం







**సాలూరు విశాఖ సమాచారం :** పాచిపెంట మండలం గడి వలస గ్రామములో నూతనముగా నిర్మాణం చేసిన శ్రీ రామాలయం విగ్రహాలను శుక్రవారం ఉదయం దగ్గరలో ఉన్న వేగావతి నది తీరంలో భక్తులు జలాభిషేకం పాలాభిషేకం చేసి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో స్వామివారి తిరువీధి మహోత్సవం నిర్వహించే శ్రీశైలం వేద పండిత పాఠశాల అధ్యక్షులు శ్రీ రామ వర్మ పంతులు విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట చేసి అనంతరం గుడి పై భాగం పూర్ణ కవచం ఏర్పాటు చేసి అనంతరం శ్రీరాముని కళ్యాణము కనులు విందుగా జరిపారు గ్రామంలో ఉన్న భక్తులు పూజలు నిర్వహించే కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం గ్రామ భక్తులు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి పనుకోవలస మంచాడవలస విశ్వనాధపురం పంచాయతీల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో గ్రామములో భక్త బృందం ధన రూపములో వస్తు రూపంలో విరాళాలు సేకరించి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు మాజీ డిప్యూటీ సీఎం పి రాజన్న దొర మాజీ ఎమ్మెల్యే ఆర్పి బంజేదవ్ రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి అన్నదాన కార్యక్రమానికి తమ వంతు సహాయ సహకారాలు వారి ప్రతినిధులుచే కానుకలు సమర్పించుకున్నారు గ్రామ పెద్దలు యువకులు నూతనముగా నిర్మించిన ఆలయానికి పూజలు హోమాలు గ్రామ పురోహితులు ఓ ప్రభాకర్ శర్మ మూడు రోజులు వేద పండితులు పూజలు నిర్వహించారు

## ప్రజల సమస్యలపై స్పందించిన

### కో కోఆర్డినేటర్ బాబి



**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్ :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు కాకినాడ రూరల్ నియోజకవర్గ కోకో ఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబి) ఆధ్వర్యంలో శుక్రవారం పెనుమర్తి గ్రామంలోని విజయ కనకదుర్గ ఆలయం ఎదురుగా ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దగ్గరికి ప్రభుత్వం రావాలి అనే నినాదాన్ని కార్యరూపంలోకి తీసుకొస్తూ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఎం కిసాన్ సాయం అందకపోవడం దీపం పథకంలో చేరిక సమస్యలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఇల్లు స్థలాలు డ్రైనేజీ నిర్మాణం వైద్య సహాయం బియ్యం కార్డుల మంజూరు కార్డుల్లో పేరు మార్పులు చేర్పులు పింఛన్లు తదితర అంశాలపై మొత్తం 173 వినతులు అందాయి. వాటిలో పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా మిగిలినవాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి కార్పొరేషన్ డైరెక్టర్ భీమా బత్తుల సత్యనారాయణ రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్ గౌడ్ రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లబత్తుల అప్పారావు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కౌజు నెహ్రూ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాందేవు సీతయ్య దొరతో పాటు పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆస్తి పన్నుల రివిజన్ పిటిషన్లను క్షుణ్ణంగా పరిశీలించండి

**విశాఖపట్నం విశాఖ సమాచారమ్ :** రెవిన్యూ విభాగానికి సంబంధించిన ఆస్తి పన్నుల రివిజన్ పిటిషన్లను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జోనల్ కమిషనర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ సమావేశ మందిరం నుండి రెవెన్యూ విభాగానికి సంబంధించిన ఈ ఆర్ పి లపై అందరు జోనల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ రెవెన్యూ విభాగానికి సంబంధించిన అన్ని జోన్లలో ఉన్న ఈ ఆర్ పి లను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఆస్తి పన్నులు, ఖాళీ స్థలాల పన్నుల మదింపు మొదలైన వాటి విషయాలలో అధికారులు ఆస్తులకు సంబంధించిన ప్లాను, దస్తావేజులు, ఆయా ప్రాంతాలు, ఆస్తుల పరిశీలన క్షుణ్ణంగా జరపాలన్నారు. ఈ ఆర్ పి లో పెట్టుకున్న దరఖాస్తులకు సంబంధించి ఆస్తి పన్నుల తగ్గింపు, సర్దుబాట్లు, వడ్డీ మాపి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఈ ఆర్ పి దాఖలు చేసిన ఆర్జీదారుడు తమ ఆస్తులకు సంబంధించిన ఆస్తి పన్నులను పూర్తి స్థాయిలో చెల్లించిన పిదప మాత్రమే వాటిని పరిగణనలోనికి తీసుకొని తగు ప్రక్రియ జరపాలని జోనల్ కమీషనర్లకు కమీషనర్ ఆదేశించారు.




## 'రామాయణ' ఎడిటింగ్ రూమ్ లోకి హాలీవుడ్ లెజెండ్..?



టాలీవుడ్ నుంచి బాలీవుడ్ దాకా ఇప్పుడు ఎక్కడ చూసినా 'రామాయణ' సినిమా గురించిన చర్చలే నడుస్తున్నాయి. నితీష్ తివారి దర్శకత్వంలో రణబీర్ కపూర్, సాయి పల్లవి సీతారాములుగా నటిస్తున్న ఈ విజువల్ వండర్ పై రోజుకో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ బయటకు వస్తోంది. లేటెస్ట్ గా సోషల్ మీడియాలో ఒక క్రేజీ రూమర్ తెగ వైరల్ అవుతోంది. హాలీవుడ్ లెజెండరీ డైరెక్టర్ క్రిస్టోఫర్ నోలన్ ఇండియాలో రూపొందుతున్న ఈ ఎపిక్ మూవీ ఎడిటింగ్ టేబుల్ వద్ద కూర్చోబోతున్నారనే వార్త ఇప్పుడు సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.
అసలు నోలన్ కి మన రామాయణానికి లింక్ ఏంటి అని చాలా మందికి డౌట్ రావచ్చు. ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నిర్మాత నమిత్ మల్హోత్రా ప్రఖ్యాత విజువల్ ఎఫెక్ట్స్ కంపెనీ 'ఐచీజు+'కి సీఈఓ కూడా. నోలన్ తీసిన ఇంటర్‌స్టెల్లార్ వంటి భారీ చిత్రాలకు విజువల్ ఎఫెక్ట్స్ అందించింది ఈ సంస్థే. ఈ క్రమంలో నమిత్ మల్హోత్రాతో నోలన్‌కు మంచి స్నేహం ఉంది. ఈ పరిచయం వల్లే మన రామాయణానికి నోలన్ సలహాలు ఇచ్చే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది.
మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే, నోలన్ సినిమాలకు ఆస్థాన సంగీత దర్శకుడైన హన్స్ జిమ్మర్ ఈ రామాయణ చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ తో కలిసి ఆయన ఈ ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తుండటంతో, నోలన్ ఈ సినిమా మేకింగ్‌లో ఇన్వాల్వ్ అవుతారనే వార్తలకు మరింత బలం చేకూరినట్లు అయింది. ఒకవేళ నిజంగానే నోలన్ ఎడిటింగ్ రూమ్ లోకి వస్తే మన ఇతిహాస గాథను ప్రపంచ స్థాయి స్టాండర్డ్స్‌లో ప్రెజెంట్ చేయడం ఖాయం. కేవలం రూమర్ అని కొట్టిపారేయడానికి వీల్లేకుండా ఈ సినిమా బడ్జెట్ కూడా రూ. 4000 కోట్లుగా ఉంది. ఇంత భారీ బడ్జెట్ పెడుతున్నప్పుడు ఇంటర్నేషనల్ మార్కెట్‌ని దృష్టిలో పెట్టుకుని హాలీవుడ్ టెక్నీషియన్ల సాయం తీసుకోవడం సహజమే. నోలన్ తన సినిమాల్లో అనుసరించే నాన్ లీనియర్ స్క్రీన్ ప్లే లేదా డిఫరెంట్ ఎడిటింగ్ స్టైల్ గనుక రామాయణానికి తోడైతే, అది ఒక సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుందని ఫ్యాన్స్ ఆశపడుతున్నారు.
యశ్ రావణుడిగా, సన్నీ డియోల్ ఆంజనేయుడిగా కనిపిస్తున్న ఈ సినిమాలో ప్రతి పాత్రను చాలా పవర్‌ఫుల్‌గా డిజైన్ చేశారు. రణబీర్ కపూర్ రాముడిగా సరికొత్త లుక్‌లో మెరవబోతున్నారు. ఇప్పటికే మొదటి భాగం షూటింగ్ కంప్లీట్ అయ్యి పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. 2026 దీపావళికి ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇంతమంది స్టార్స్ ఉన్న సినిమాలో నోలన్ పేరు వినిపించడమే ఇప్పుడు సినిమా రేంజ్‌ను ఎక్కడికో తీసుకెళ్లింది. ఇక నోలన్ స్వయంగా ఎడిటింగ్ చేస్తారా లేక కేవలం తన ఫ్రెండ్ నమిత్ కోసం కొన్ని సూచనలు ఇస్తారా అనేది త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఏదేమైనా మన పురాణ గాథను గ్లోబల్ లెవల్‌లో చూపించడానికి మేకర్స్ చేస్తున్న ఈ ప్రయత్నం మెచ్చుకోదగినదే. ఈ క్రేజీ కాంబినేషన్ నిజమైతే ఇండియన్ సినిమా హిస్టరీలోనే రామాయణ ఒక బిగ్గెస్ట్ ప్రాజెక్టుగా నిలిచిపోతుంది.

## టాలీవుడ్ ని ఏలేసేలా బుచ్చిబాబు ప్రణాళిక!



సుకుమార్ శిష్యుడిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన బుచ్చిబాబు టాలీవుడ్ ని ఏలేసే పెద్ద ప్లాన్ లో ఉన్నాడా? గురువును మించిన శిష్యుడిగా ఎదిగే వ్యూహ రచనతో ముందుకెళ్తున్నాడా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. ఇక్కడ ముందుగా అబ్దుల్ కలాం గారు యువతను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఒక్కసారి గుర్తు చేసుకోవాలి. పెద్ద పెద్ద కలలు కనడం..వాటిని సాధించే వరకూ విడిచిపెట్టకపోవడం. ఈ తత్వాన్ని యువత అలవార్చుకోవాలని కలాంగారు చెప్పారు. తాజాగా బుచ్చిబాబును చూస్తుంటే? కలాం గారు మాటలే గుర్తొస్తున్నాయి.
బుచ్చిబాబు కలలు కూడా పెద్ద పెద్దగానే ఉన్నాయి. వాటి కోసం నిరంతరం అంతే శ్రమిస్తున్నాడు అన్నది అంతే వాస్తవం. తొలి సినిమా -ఉప్పెన- తో హిట్ అందుకున్నాడు. దీంతో రెండవ సినిమా టార్గెట్ గా యంగ్ టైగర్ ఎన్టీఆర్ ను పెట్టుకున్నాడు. కథ చెప్పాడు. కానీ చివరి నిమిషంలో ఆ కాంబినేషన్ సెట్ అవ్వలేదు. అటుపై మరో కథతో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ని మెప్పించాడు. సింగిల్ సిట్టింగ్ లోనే చరణ్ తో ఒకే చెప్పించాడు. ప్రస్తుతం ఇద్దరి కాంబినేషన్ లో -పెద్ది- తెరకెక్కు తోన్న సంగతి తెలిసిందే. ఆ సినిమా దర్శకుడిగా ఏకంగా సంగీత సంచలనం రెహమాన్ నే రంగంలోకి దించాడు బుచ్చిబాబు.
ఇది చూసి గురువు సుకుమార్ షాక్ అయ్యాడు. ఎన్టీఆర్, చరణ్, రెహమాన్ అంటూ పెద్ద పెద్ద వారి పేర్లు చెప్పడంతో? తాను కూడా చేయలేని సాహసాన్ని శిష్యుడు చేస్తున్నాడని ఎంతో మురిసిపోయాడు. ఓ క్లారిటీలో బుచ్చిబాబు ముందుకెళ్లడాన్ని గురువుగా ఎంతో ప్రశంసించాడు. భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరో హించాలని కోరుకున్నారు. -పెద్ది- తర్వాత తారక్ తోనే సినిమా చేస్తానని ఆ మధ్య బుచ్చిబాబు అన్నాడు. అందులో ఎలాంటి అనుమానాలు కూడా ఉండవన్నాడు. కానీ ఇప్పటికిప్పుడు ఎన్టీఆర్ దొరికే పరిస్థితులు లేవు. అతడికి రకరకాల కమిట్ మెంట్లు ఉండటంతో? బుచ్చిబాబు ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వైపు చూస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది.
ప్రభాస్ కి ఇప్పటికే స్టోరీ లైన్ వినిపించాడట. డార్లింగ్ కి నచ్చడంతో పాజిటివ్ గా స్పందించాడుట. దీంతో బుచ్చిబాబు పూర్తి స్క్రిప్ట్ ను సిద్ధం చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు వినిపిస్తోంది. -పెద్ది- రిలీజ్ అనంతరం బుచ్చిబాబు ఆ పనుల్లో నిమగ్నమయ్యే అవకాశం ఉంది. మరి ప్రభాస్ కూడా బిజీగా ఉన్నాడు? అతడు ఎలా డేట్లు ఇవ్వగలడు? అంటే డార్లింగ్ కిందా మీదా పెట్టి ఏదో ఒకటి చేయగల సమర్థుడు. -ఫౌజీ- ప్రాజెక్ట్ అలా పట్టాలెక్కిందే. ఈ నేపథ్యంలో బుచ్చిబాబు కూడా సరైన స్టోరీతో మెప్పిస్తే డేట్లు ఇవ్వకపోతాడా? అన్న కాన్ఫిడెంట్ తో డార్లింగ్ ముందుకెళ్లాడు. లక్కీగా ఊ కొట్టాడు. ఇదంతా పక్కన బెడితే -ఉప్పెన- అనే సక్సస్ తో బుచ్చిబాబు వరుసగా అగ్ర హీరోల్ని టార్గెట్ చేయడం చూస్తుంటే? పెద్ద ప్లాన్ తోనే ఇండస్ట్రీకి వచ్చినట్లు కనిపిస్తోంది. -పెద్ది- సక్సెస్ అయితే గనుక బుచ్చిబాబు వేగాన్ని ఆపడం అసాధ్యమే.

## హోలీ ట్రోల్స్‌పై అనసూయ పోస్ట్

యాంకర్, నటి అనసూయ మరోసారి సోషల్ మీడియా వేదికగా పెట్టిన పోస్ట్ వైరల్ అవుతోంది. సామాజిక మాధ్యమాల్లో తరచూ ట్రోలింగ్ ఎదుర్కొనే ఆమె.. తప్పు చేసే వారిని వదిలేసి, దాన్ని ఎదురించే వారిని టార్గెట్ చేయడంపై తాజాగా అసహనం వ్యక్తంచేశారు. ఇటీవల అనసూయ హోలీ సంబరాల్లో పాల్గొన్న విషయం తెలిసిందే. ఆమె మాట్లాడటం ప్రారంభించగానే కొందరు వ్యక్తులు 'ఆంటీ..' అంటూ కామెంట్స్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతుండగా.. కొందరు ఆ వీడియోకు వచ్చిన కామెంట్స్‌తో రీల్స్ చేశారు. ఆ రీల్స్ గురించి ఆమె పోస్ట్ పెట్టారు. "ఇతరుల బాధలో కూడా వినోదం వెతికేవారిని, కనీస సానుభూతి, సామాజిక బాధ్యత లేని వారిని సమాజం నిలదీసే రోజు రావాలి. వయసును బట్టి హేళన చేయడం, మహిళలపై వివక్ష చూపడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇలాంటివారిని చూసి సమాజం సిగ్గుపడాలి. అందరూ 'నాకెందుకులే' అని వదిలేస్తూ వెళ్తే ఇలాంటివి సాధారణం అవుతాయి. క్రమంగా మానవత్వాన్ని కోల్పోతాం". "నేను ఉన్నది ఉన్నట్లు చెప్పడానికి మొహమాట పడను. నేను సాధించిన విజయాలు, నా ప్రయాణం నాకెంతో గర్వకారణం. ఎన్ని విమర్శలు ఎదురైనా తట్టుకొని నిలబడిన ధైర్యమే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది. ఎన్నో ఎదుర్కొని పైకి వచ్చేవారిని విమర్శించడానికి మీరెవరు?" అంటూ ట్రోలర్స్‌ను ఉద్దేశించి ఆమె పోస్ట్ పెట్టారు.








## రసవత్తర సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై విజయం



శాంసన్ వీరవిహారంతో కొండంత లక్ష్యాన్ని నిర్దేశించిన టీమ్ఇండియాకు విజయం అంత తేలికగా దక్కలేదు. ప్రతిఘటన తప్పలేదు. బెతెల్ అద్భుత పోరాటంతో ఇంగ్లిష్ జట్టు.. డిఫెండింగ్ ఛాంపియన్‌ను కలవరపెట్టింది. ఓడించినంత పనిచేసింది. కానీ తీవ్ర ఒత్తిడిలో బుమ్రా ఎప్పటిలాగే అద్భుతంగా బౌలింగ్ చేశాడు. జోరు మీదున్న ఇంగ్లాండ్ బ్యాటర్లకు కళ్లెం వేస్తూ.. భారత్ గట్టెక్కడంలో కీలక పాత్ర పోషించాడు. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌ను టీమ్ఇండియా ఢీకొంటుంది.
ముంబయి : టీమ్ఇండియా టీ20 ప్రపంచకప్ ఫైనల్లో అడుగుపెట్టింది. సంజు శాంసన్ (89; 42 బంతుల్లో 8x4, 7x6) మెరుపు ఇన్నింగ్స్‌కు బుమ్రా (1/33) అద్భుత బౌలింగ్ తోడు కావడంతో గురువారం ఉత్కంఠభరితంగా సాగిన సెమీఫైనల్లో 7 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను మట్టికరిపించింది. శాంసన్‌తో పాటు శివమ్ దూబె (43; 25 బంతుల్లో 1x4, 4x6), ఇషాన్ కిషన్ (39; 18 బంతుల్లో 4x4, 2x6) కూడా బ్యాట్ ఝుళిపించడంతో మొదట భారత్ 7 వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసింది. భారీ ఛేధనలో బెతెల్ (105; 48 బంతుల్లో 8x4, 7x6) గొప్పగా పోరాడినా ఇంగ్లాండ్‌కు ఓటమి తప్పలేదు. ఆ జట్టు 7 వికెట్లకు 246 పరుగులే చేసింది.

## మ్యాచ్ గెలిచాం.. ఫైనల్ చేరాం.



మ్యాచ్ గెలిచాం.. ఫైనల్ చేరాం.. సంతోషమే! కానీ గెలిచిన తీరు మాత్రం సంతృప్తినిచ్చేది కాదు 254 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించి వంద లోపే నాలుగు కీలక వికెట్లు పడగొట్టి కూడా.. చివరికి చచ్చీ చెడీ గెలిచింది టీమ్ఇండియా. మొదట్లో అసాధ్యంలా కనిపించిన ఛేదనను.. ఒక దశలో ఇంగ్లాండ్ సులువుగానే పూర్తి చేస్తుందేమో అనిపించింది. బుమ్రా 18వ ఓవర్ వేయడానికి ముందు విజయంపై ధీమా లేదు. ఓటమి భయమే ఎక్కువగా కనిపించింది. మన బౌలింగ్ డొల్లతనాన్ని ఈ మ్యాచ్ బట్టబయలు చేసింది. బుమ్రాను మినహాయిస్తే.. సరైన బౌలింగ్ ప్రత్యామ్నాయం కనిపించక, ఎవరికి ఓవర్ ఇస్తే ఏమవుతుందో అని కంగారు పడే పరిస్థితి కనిపించింది. ఈ ప్రపంచకప్ ముందు వరకు ప్రత్యర్థి బ్యాటర్లు ఛేదించలేని 'మిస్టరీ' స్పిన్నర్‌గా కనిపించిన వరుణ్ చక్రవర్తి.. టోర్నీలో తేలిపోయాడు. సెమీస్‌లో అయితే అతడి ప్రదర్శన ఘోరం. 4 ఓవర్లలో ఏకంగా 64 పరుగులు సమర్పించుకున్నాడు. పేలవ ఫామ్‌లో ఉన్న బట్లర్‌ను బౌల్డ్ చేయడం తప్పితే అతడి బౌలింగ్‌లో ఏ ప్రత్యేకతా లేదు. వరుణ్ బంతి అందుకోవడం ఆలస్యం.. అప్పుడే క్రీజులోకి వచ్చిన బెతెల్ వరుసగా మూడు సిక్సర్లు బాదేశాడు. ఈ ఊపులో తర్వాత మిగతా బౌలర్లనూ ఉతికారేశాడు. అక్షర్ పటేల్ సైతం ప్రభావం చూపలేకపోయాడు. అర్ష్‌దీప్ అప్పుడప్పుడూ కొన్ని అద్భుతమైన బంతులు వేసినా.. చాలాసార్లు అదుపు తప్పాడు. పదే పదే వైడ్‌లు వేయడం.. షాట్లు కొట్టే అవకాశం ఇవ్వడంతో భారత్‌కు టెన్షన్ తప్పలేదు. బుమ్రా చివరి రెండు ఓవర్లలో అద్భుతంగా బౌలింగ్ చేసి జట్టును కాపాడాడు కానీ.. లేదంటే అంత స్కోరు చేసినా, ఓటమి తప్పేది కాదు. జట్టులో ఇంకో నమ్మదగ్గ బౌలర్ లేకపోవడం భారత జట్టు బలహీనతను చాటిచెబుతుంది. ఫైనల్లో తలపడబోయే న్యూజిలాండ్ జట్టులో ఓపెనర్లు ఫిన్ అలెన్, టిమ్ సీఫర్ట్ సహా చాలామంది విధ్వంసకారులున్నారు. వీళ్లందరినీ ఈ బౌలర్లు ఏమేర అడ్డుకుంటారన్నది సందేహం. వరుణ్ పూర్తిగా తేలిపోతున్న నేపథ్యంలో అతడి స్థానంలో కుల్‌దీప్‌ను ఎంచుకోవడం అనివార్యంగా కనిపిస్తోంది. బుమ్రా కాకుండా మిగతా బౌలర్లు బంతుల్లో పదును పెంచకపోతే కప్పు మీద ఆశలు పెట్టుకోవడం కష్టమవుతుంది.

## నా బ్యాటింగ్ కాదు.. బుమ్రా బౌలింగ్ వల్లే గెలిచాం: సంజూ శాంసన్



తన బ్యాటింగ్ కంటే, జస్‌ప్రీత్ బుమ్రా అసాధారణ బౌలింగ్ ప్రదర్శనతోనే విజయం సాధించామని టీమిండియా విధ్వంసకర ఓపెనర్ సంజూ శాంసన్ అన్నాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు తన కంటే బుమ్రానే అర్హుడని అభిప్రాయపడ్డాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భాగంగా వాంఖడే వేదికగా గురువారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 7 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించి సెమీఫైనల్ దూసుకెళ్లింది.
ఈ మ్యాచ్‌లో సంజూ శాంసన్(42 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సలతో 89) విధ్వంసకర హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ హాఫ్ సెంచరీ సాధించి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. భారత జట్టులో టాప్ స్కోరర్‌గా నిలిచిన సంజూ శాంసన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. అయితే ఈ అవార్డుకు బుమ్రానే సరైనోడని ఈ సందర్భంగా మాట్లాడుతూ సంజూ చెప్పుకొచ్చాడు. బుమ్రా లేకుంటే ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలిచేది కాదని, తాను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకునేవాడిని కాదని అభిప్రాయపడ్డాడు.
నా బ్యాటింగ్‌కు ఓ లెక్కుంది..
'ఈ విజయం చాలా గొప్పగా అనిపిస్తోంది. నిజం చెప్పాలంటే.. గత మ్యాచ్‌లోనే నేను ఫామ్ అందుకున్నాను. ఆ జోరును అలానే కొనసాగించాలని అనుకున్నాను. దేశం కోసం ఆడే కీలకమైన మ్యాచ్‌ల్లో ఫామ్‌లోకి రావడం అంత సులువు కాదు. అందుకే ఇది పెద్ద మ్యాచ్ అని, నా బ్యాటింగ్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని భావించాను. అందుకే క్రీజులో సెట్ అయ్యేందుకు కాస్త అదనపు సమయం తీసుకున్నాను. నా ఇన్నింగ్స్‌ను లెక్కలతో ప్లాన్ చేసుకున్నాను. ఈ మ్యాచ్ కోసం బాగా ప్రిపేర్ అయ్యాను. అన్నీ అనుకున్నట్లే జరిగాయి.
ఆరంభంలో కొంచెం అదృష్టం కలిసొచ్చింది(బ్రూక్ క్యాచ్ వదిలేయడంపై). ఆ తర్వాత దానిని అలాగే కొనసాగించాలనుకున్నాను. వాంఖడేలో ఆడుతున్నప్పుడు ఏ స్కోరైనా ఛేజ్ చేయొచ్చని మాకు తెలుసు. అందుకే వీలైనన్ని ఎక్కువ పరుగులు చేయాలనుకున్నాను. ఇక్కడ 250 పరుగులు కూడా ఛేజ్ చేయదగినవిగానే అనిపించింది. ఇంగ్లండ్ అద్భుతంగా బ్యాటింగ్ చేసింది. వారి బ్యాటింగ్ చేసిన తీరును మెచ్చుకోవాల్సిందే. మొత్తానికి మేం ఒక గొప్ప సెమీఫైనల్ ఆడాం.
మేం వాంఖడేలో చాలా క్రికెట్ ఆడాం. ఇక్కడ ఛేజింగ్ కొంచెం ఈజీగా ఉంటుంది. వారు టాస్ గెలిచి మమ్మల్ని బ్యాటింగ్‌కు పిలిచారు. అభిషేక్ ఔట్ అయిన తర్వాత నేను.. ఇషాన్ ఆడిన తీరు.. మా భాగస్వామ్యం చూశాక 250 పరుగులు సాధ్యమనిపించింది. డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా మేం అదే మాట్లాడుకున్నాం. జట్టు ఈరోజు ఆడిన తీరుకు చాలా సంతోషంగా ఉంది. అయితే ఈ విజయానికి ప్రధాన కారణం జస్ప్రీత్ బుమ్రా. అతను ప్రపంచ స్థాయి బౌలర్. తరానికి ఒక్కడే పుట్టే అరుదైన బౌలర్. ఈరోజు తను అదే నిరూపించాడు. నిజానికి ఈ అవార్డు బుమ్రాకే దక్కాలి. డెత్ ఓవర్లలో అతను అలా బౌలింగ్ చేయకపోయి ఉంటే.. నేను ఇక్కడ ఇలా నిలబడి ఉండేవాడిని కాదు. కష్టతరమైన పరిస్థితుల్లో తమను తాము నమ్ముకుని బౌలింగ్ చేసిన బౌలర్లకే పూర్తి క్రెడిట్ దక్కుతుంది.
సెంచరీలు ముఖ్యం కాదు..
వాంఖడే ప్రేక్షకులు అద్భుతం. మీరు ఇక్కడ చూసినట్లుగా.. చిన్నప్పటి నుంచి వాంఖడేలో ఆడటం ఒక అద్భుతమైన అనుభూతి. ఇక్కడి ప్రజలు భారత్‌కే కాకుండా ఇంగ్లండ్‌కు కూడా మద్దతు ఇచ్చారు. వారు నిజమైన క్రికెట్ అభిమానులు. ఇక్కడ ఆడటం నేను బాగా ఆస్వాదిస్తాను. వారికి ఒక సానుకూల ఫలితాన్ని అందించాలనుకున్నాం. ఈరోజు ఫలితం వారిని సంతోషపెట్టినందుకు నేను చాలా హ్యాపీగా ఉన్నాను.

నా దృష్టిలో సెంచరీలు అంత ముఖ్యం కాదు. టీ20ల్లో మీరు సెంచరీ చేయాలని అనుకోలేరు. అది ఆడే ప్రక్రియలో వస్తుంది. ఇది టెస్ట్, వన్డే మ్యాచ్ కాదు.. నిదానంగా ఆడుతూ మళ్లీ వేగం పెంచడానికి. ఒకసారి మీకు మంచి ఆరంభం దక్కినప్పుడు, అది కూడా మొదట బ్యాటింగ్ చేస్తున్నప్పుడు.. ఆగుతూ ఆడే అవకాశం ఉండదు. కేవలం బంతిని బలంగా బాదుతూ ముందుకు వెళ్లడమే ఏకైక మార్గం. మనం సరైన దిశలో ఆడుతున్నప్పుడు ఎన్ని పరుగులు వస్తాయనేది మనకు తెలియదు. నాకు ఎన్ని పరుగులు వచ్చాయన్న దానికంటే, నా దేశం గెలుపులో నా వంతు సహకారం అందించినందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను.'అని సంజూ శాంసన్ చెప్పుకొచ్చాడు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com